


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 233 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 29 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 233 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 29 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# ఇక అమరావతి అన్‌స్టాపబుల్

- అమరావతి రాజధాని పనులు మే 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా పునఃప్రారంభం
- అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు సన్నాహాలు
- రాజధానికి 34 వేల ఎకరాలిచ్చిన 29 వేల మంది రైతుల త్యాగాలను స్మరించిన సీఎం చంద్రబాబు
- ప్రపంచ ప్రఖ్యాత వర్సిటీలు అమరావతికి రాబోతున్నాయని వెల్లడి.
- రైతులకు అండగా ఉంటామని, కొందరిని దత్తత తీసుకోవాలని విట్ ఛాన్సలర్‌కు విజ్ఞప్తి.



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి ఎలాం టి ఢోకా లేదని, త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక అమరావతి అన్‌స్టాపబుల్ అన్నా రు. తాను మాటలు చెప్పే వ్యక్తిని కాదని, ప్రజలకు మేలు చేసి చూపిస్తానని పేర్కొన్నారు.తనపై అపా రమైన నమ్మకంతో 29 వేల మంది రైతులు దాదాపు 34 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ఇచ్చారని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములయ్యేం దుకు రైతులు ముందుకు రావడం ప్రశంసనీయమని కొనియాడారు. దివంగత ప్రధాని, తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను తాను అందిపుచ్చుకుని, భవిష్యత్తు ఐటీ రంగంలోనే ఉందని ముందుగానే గుర్తించి, దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని చంద్రబాబు తెలిపారు. ఆ దూరదృష్టితోనే హైదరాబాద్‌లో కేవలం 14 నెలల్లో హైటెక్ సిటీని నిర్మించామని ఆయన వివరించారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా అమరావతిపైనే కేంద్రీకృతమైందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. త్వరలోనే అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు కీలక ప్రకటన చేశారు. అంతేకాకుండా, అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి దీటుగా ఇక్కడ 'క్వాంటమ్ వ్యాలీ' ఏర్పాటుకు కూడా పునాది వేస్తున్నామని వెల్లడించారు. "ఒకప్పుడు నేను ఐటీ గురించి మాట్లాడితే కొందరికి అర్థం కాలేదు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి ప్రస్తావిస్తే, అదేమిటని కొందరు అడుగుతున్నారు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త (ఎంట్రప్రెన్యూర్) తయారు కావాలన్నదే తన ఆకాంక్ష అని ఆయన తెలిపారు. అమరావతిలో ఇప్పటికే విట్, ఎస్ఆర్ఎం వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయని, భవిష్యత్తులో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాలు కూడా ఇక్కడికి రానున్నాయని చంద్రబాబు వివరించారు. రాజధాని కోసం భూములిచ్చి త్యాగాలు చేసిన 29 వేల మంది రైతులు, రైతు కూలీలకు అండగా నిలవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని ఆయన ఉద్ఘాటించారు. రైతులకు మరింత చేయూతనివ్వడంలో భాగంగా, వారిలో కొందరిని

వివరాలు 2లో..

## 2026 మార్చి నాటికి బందరు ఫిషింగ్ హార్బర్ పనులను పూర్తి చేస్తాం

- మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలించిన మంత్రులు
- 2026 మార్చి నాటికి హార్బర్ పూర్తి లక్ష్యమని మంత్రి జనార్దన్
- ప్రాజెక్టులో ఇప్పటికే 57 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను 2026 మార్చి నాటికి పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ తెలిపారు. ఈ లక్ష్యంతోనే హార్బర్ నిర్మాణ కాలపరిమితిని రెండోసారి పొడిగించినట్లు ఆయన తెలిపారు. సోమవారం నాడు మచిలీపట్నంలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ పనుల పురోగతిని మంత్రులు బీసీ జనార్దన్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తిగా నిలిచిపోయాయని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పనులను వేగవంతం చేసిందని, సుమారు రూ. 422 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 57 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. అయితే, కొన్ని కీలక పనుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని అంగీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను రూ.3500 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీ మౌత్ సమస్య పరిష్కారానికి సాంకేతిక నివేదిక కోసం చెన్నైకి పంపామని, అది 45 రోజుల్లో వస్తుందని, ఆ తర్వాత ఆ పనులు కూడా పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ హార్బర్ పూర్తయితే, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని జనార్దన్ పేర్కొన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పురోగతిపై ప్రతి నెలా సమీక్షలు నిర్వహిస్తూ, స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ సహకారంతో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామని

వివరాలు 2లో..

## తిరుపతి జిల్లాలో ఘోర ప్రమాదం.. ఐదుగురు దుర్మరణం



పెన్ పవర్ డెస్క్:తిరుపతి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై పాకాల మండలం తోటపల్లి వద్ద కంటైనర్ కిందకు కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యాటకులను కాపాడటంలో నేను విఫలమయ్యాను.. ఎలా క్షమాపణలు చెప్పాలో తెలియడం లేదు

- పహల్గామ్ దాడిపై జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో సీఎం ఒమర్ ప్రసంగం
- పర్యాటకులకు భద్రత కల్పించడంలో విఫలమయ్యానని అంగీకారం
- మృతుల కుటుంబాలకు క్షమాపణలు, తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం
- ఈ విషాదాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్ర హోదా అడగబోనని స్పష్టీకరణ
- ఉగ్రవాద నిర్మూలనకు ప్రజల మద్దతు అత్యవసరమని పిలుపు



పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీ వేదికగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై జరిగిన అత్యవసర సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రానికి వచ్చిన అతిథులను కాపాడటంలో తాను విఫలమయ్యానని అన్నారు. ఈ దాడిలో మరణించిన 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకుని రాష్ట్ర హోదా కోసం తాను డిమాండ్ చేయబోనని ఆయన స్పష్టం చేశారు. పహల్గామ్ దాడిపై చర్చించేందుకు

వివరాలు 2లో..

## ఏపీ నుంచి రాజ్యసభ రేసులో మంద కృష్ణ మాదిగ, అన్నామలై, స్మృతి ఇరానీ?

- విజయసాయిరెడ్డి రాజీనామాతో ఏపీలో రాజ్యసభ స్థానం ఖాళీ
- మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల గడువు ముగింపు
- ఇంకా ఖరారు కాని కూటమి తరపున అభ్యర్థి... కొనసాగుతున్న ఉత్కంఠ
- చంద్రబాబు... మందకృష్ణ పేరు సిఫార్సు చేసినట్లు సమాచారం
- ప్రచారంలో అన్నామలై, స్మృతి ఇరానీ పేర్లు కూడా!



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న ఒక రాజ్యసభ స్థానానికి నామినేషన్ల దాఖలు గడువు సమీపిస్తోంది. అభ్యర్థి ఎవరనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వైసీపీ నేత విజయసాయిరెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఈ ఖాళీకి రేపు మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. అధికార ఎన్డీయే కూటమి తరపున అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

వివరాలు 2లో..

## పద్మభూషణ్ అవార్డును అందుకున్న బాలకృష్ణ

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకున్న బాలయ్య
- సినీ రంగానికి, సమాజానికి అందించిన సేవలకు గుర్తింపుగా పద్మభూషణ్ పురస్కారం
- ఈ కార్యక్రమానికి హాజరైన బాలకృష్ణ కుటుంబ సభ్యులు



వివరాలు 2లో..

## పాకిస్థాన్ నుంచి 1,000 మందికి పైగా భారతీయులు తిరుగు ప్రయాణం

- పాకిస్థాన్ నుంచి వాఘా ద్వారా స్వదేశానికి 1000 మందికి పైగా భారతీయులు
- గత 6 రోజుల్లో పహల్గామ్ దాడి అనంతరం పరిణామం
- వీసాల రద్దుతో పర్యటనలు అర్ధాంతరంగా ముగింపు
- 800కు పైగా పాకిస్థానీయులు భారత్ నుంచి తిరుగు ప్రయాణం



పెన్ పవర్ డెస్క్:పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌లో పర్యటిస్తున్న భార తీయులు తమ ప్రయాణాలను అర్ధాంతరంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వస్తున్నారు. గత ఆరు రోజుల్లో వెయ్యి మందికి పైగా

వివరాలు 2లో..

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సుప్రీంకోర్టులో మరోసారి ఊరట

- లిక్కర్ స్కామ్ లో మిథున్ రెడ్డిపై ఆరోపణలు
- సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మిథున్ రెడ్డి
- కౌంటర్ దాఖలు చేసిన ఏపీ సీఐడీ



వివరాలు 2లో..

## ఏపీలో సమంతకు గుడికట్టిన వీరాభిమాని

- ఏపీలోని బాపట్లలో నటి సమంతకు ఆలయం
- ఆలయంలో సమంత బంగారు రంగు విగ్రహం ఏర్పాటు
- సమంత పుట్టినరోజున గుడి వద్ద కేక్ కటింగ్, అన్నదానం
- సంఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్, మిశ్రమ స్పందనలు



వివరాలు 2లో..

## భారత్-ఫ్రాన్స్ మధ్య 26 రఫేల్ యుద్ధ విమానాలకు ఒప్పందం

- భారత్-ఫ్రాన్స్ మధ్య రూ.63,000 కోట్ల విలువైన రక్షణ ఒప్పందం
- భారత నౌకాదళం కోసం 26 రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలు
- స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి కార్యకలాపాలు
- 37 నుంచి 65 నెలల్లో విమానాల డెలివరీ పూర్తి



పెన్ పవర్ డెస్క్:భారత నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ మెరైన్ (Rafale Marine) యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ఇరు దేశాల మధ్య సోమవారం మెగా ఒప్పందం కుదిరింది. సుమారు రూ. 63,000 కోట్ల విలువైన ఈ ఒప్పందంపై భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, ఫ్రాన్స్ ప్రతినిధులు సంతకాలు చేశారు.

వివరాలు 2లో..

## కోవిడ్ టీకాలు: దీర్ఘకాలిక దుష్ప్రభావాలు లేనట్టే!



పెన్ పవర్ డెస్క్:కోవిడ్-19 వ్యాక్సిన్‌ల వల్ల శరీర జీవక్రియ ఆరోగ్యంపై ఎటువంటి ముఖ్యమైన, దీర్ఘకాలిక ప్రభావాలు ఉండవని ఆస్ట్రేలియాలో జరిపిన ఒక అధ్యయనం స్పష్టం చేసింది. వ్యాక్సిన్‌ల వల్ల దీర్ఘకాలంలో దుష్ప్రభావాలు కలుగుతాయే మోనన్న ఆందోళనలను ఈ పరిశోధన ఫలితాలు తొలగిస్తున్నాయి. ఆస్ట్రేలియాలోని మర్డోక్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 33 మందిని 480 రోజుల

వివరాలు 2లో..

- కోవిడ్-19 వ్యాక్సిన్‌లు జీవక్రియ ఆరోగ్యంపై ఎటువంటి దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం చూపవు
- ఆస్ట్రేలియాలోని మర్డోక్ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనంలో ఈ విషయం వెల్లడి
- వ్యాక్సిన్ తీసుకున్న వారిలో కీలక ఆరోగ్య సూచికల్లో కనిపించని ముఖ్యమైన మార్పులు
- వ్యాక్సిన్‌ల భద్రతపై ఈ అధ్యయనం మరింత భరోసా ఇస్తుందని తెలిపిన పరిశోధకులు

## ఎడిటర్ వ్యూ

# కేసీఆర్ లో మార్పు వచ్చిందా?

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ లో ఓటమి తర్వాత ఏదైనా మార్పు వచ్చి ఉండవచ్చునేమోనని అందరూ భావించారు. ఇకనైనా అందరిని కలుపుకుని వెళుతూ అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆయన ముందుకు వెళతారని భావించారు. కానీ నిన్న జరిగిన సభ తీరు చూసిన వారికి ఎవరికైనా ఓటమి తర్వాత కూడా కేసీఆర్ లో ఇసుమంత మార్పు రాలేదని స్పష్టంగా తెలుస్తుంది. సిల్వర్ జూబ్లీ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ జరుపుకుంటుంటే కనీసం పార్టీ కార్యాలయానికి రావాలన్న స్పృహ కూడా కేసీఆర్ లో కనిపించలేదు. తాను పెట్టిన పార్టీ ఇరవై ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేసీఆర్ స్వయంగా వచ్చి పార్టీ కార్యాలంలో జెండా ఎగురవేస్తారనుకున్నా, ఆ బాధ్యతను తన కుమారుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అప్పగించారు.

**లక్షలాది మంది నిరీక్షిస్తున్నా...**

ఇక ఎల్కతుర్తిలో జరిగిన సభకు కేసీఆర్ ఆరున్నర గంటలకు కానీ చేరుకోలేదు. వరంగల్ లో లక్షలాది మంది కార్యకర్తలు, నేతలు వచ్చి నిరీక్షిస్తుంటే ముందుగా వచ్చి కార్యకర్తలను పలుకరించాలన్న ధ్యాస ఆయనకు లేకుండా పోయందన్న విమర్శలు వినపడుతున్నాయి. ఎన్నికలలో ఓటమి తర్వాత ఎక్కువగా ఫామ్ హౌస్ కే పరిమితమయిన కేసీఆర్ బయటకు రావడమే మానుకున్నారు. అదేమంటే ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలి కదా? అని ప్రశ్నిస్తున్నారు. దీంతో పాటు అన్యాయంగా కేసులు పెడితే సహించబోమని అన్న కేసీఆర్ నాడు ధర్నా చౌక్ లో కూడా ఆందోళనలు చేయకుండా ధర్నా చౌక్ ను ఎత్తివేసింది నిజం కాదా? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

**కాంగ్రెస్ పైనే...**

తాను ఉన్నప్పుడు తెలంగాణ బంగారంలా ఉండేదని, ఇప్పుడు పూర్తిగా దానిని మట్టిమయం చేశారని ఆరోపణలు కాంగ్రెస్ పైన చేశారు. అంతవరకూ బాగానే ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అసలు ఏమీ అమలు చేయలేదని చెప్పడం ఏంటని హస్తం పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర సమయంలోనే ఇచ్చిన హామీల్లో చాలా వరకూ పూర్తి చేశామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. దీంతో పాటు కేసీఆర్ మునుపటిలాగా ప్రసంగంలో పస తగ్గినట్లే కనిపించింది. పంచ్ లు లేవు.. ఏదో నలభై నిమిషాలు మాట్లాడి అలా వెళ్లిపోయారు తప్పించి కొత్తగా కేసీఆర్ చెప్పిందేమీ లేదని సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. ఇంతోటి దానికి సిల్వర్ జూబ్లీ వేడుకల పేరిట ఇంత స్థాయిలో ఏర్పాట్లు చేస్తే ఉస్సూరుమనిపించి వెళ్లారని సభకు వచ్చిన కార్యకర్తలే అనుకోవడం వాస్తవమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

**సభ జరిగిన తీరు...**

నిన్నసభ జరిగిన తీరు.. ముందు.. తర్వాత పరిశీలిస్తే కేసీఆర్ లో ఎలాంటి మార్పు రాలేదని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. ఆయనకు ఓపిక లేదని, ఇన్ని లక్షలమంది సభకు వచ్చినా ఆయన సమయానికి రాకపోవడమే కాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా స్క్రిప్ట్ చూసి చదవడంపై కూడా సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయవచ్చు. అది రాజకీయాల్లో సహజమే. కానీ సొంత పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నాన్ని కేసీఆర్ చేయలేకపోయారంటున్నారు. ఆయనకు ఇంత పెద్ద సభ జరిగినా రావడానికి తీరిక, సమయం లేకపోతే, రేపు సచివాలయానికి వస్తారన్న గ్యారంటీ ఏంటని పలువురు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.

# పాకిస్థాన్ నుంచి 1,000 మందికి పైగా భారతీయులు తిరుగు ప్రయాణం

- మొదటి పేజీ తరువాయి

భారతీయులు వాఘా సరిహద్దు ద్వారా భారతదేశానికి చేరుకున్నారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వీసాలు రద్దు కావడంతోనే వారు తమ పర్యటనలను కుదించుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది.

పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత నెలకొన్న పరిస్థితుల కారణంగా, పాకిస్థాన్‌లో ఉన్న భారతీయుల వీసాలపై ప్రభావం పడింది. దీనితో అక్కడ వివిధ పనులపై వెళ్లిన వారు, యాత్రికులు తమ పర్యటనలను మధ్యలోనే ముగించుకుని వెనక్కి వస్తున్నారు. గత ఆరు రోజుల వ్యవధిలో 1,000 మందికి పైగా భారత పౌరులు వాఘా సరిహద్దు చెక్‌పోస్ట్ ద్వారా స్వదేశానికి తిరిగి వచ్చినట్లు ఒక ప్రభుత్వ అధికారి తెలిపారు.ఇదే సమయంలో, భారతదేశంలో ఉన్న పాకిస్థానీయులు కూడా తమ దేశానికి తిరిగి వెళుతున్నారు. గత ఆరు రోజుల్లో 800 మందికి పైగా పాకిస్థానీ పౌరులు వాఘా మార్గం ద్వారా స్వదేశానికి చేరుకున్నారని సదరు అధికారి వివరించారు. ఒక్క ఆదివారం రోజే 115 మంది భారతీయులు పాకిస్థాన్ నుంచి రాగా, 236 మంది పాకిస్థానీయులు భారత్ నుంచి వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

అయితే, ఈ పరిణామాల మధ్య ఇరు దేశాలకు చెందిన దీర్ఘకాలిక వీసాలు కలిగిన

వారు స్వదేశాలకు తిరిగి వెళ్లే విషయంలో కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నట్లు కూడా అధికారి తెలిపారు. ఇరు దేశాల మధ్య రాకపోకలపై ప్రస్తుత ఆంక్షలు లేదా నిబంధనల మార్పులు వీరి ప్రయాణాలకు ఆటంకం కలిగిస్తోందని సమాచారం. సరిహద్దుల వద్ద ప్రయాణికుల రద్దీ పెరగడంతో పాటు, వీసా సంబంధిత సమస్యలు కూడా తలెత్తుతున్నాయని సమాచారం.

# ఏపీ నుంచి రాజ్యసభ రేసులో మంద కృష్ణ మాదిగ, అన్నామలై, స్మృతి ఇరానీ?

- మొదటి పేజీ తరువాయి

ఈ స్థానం బీజేపీ కోటా కింద భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తూ ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా, ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేరును ఈ రాజ్యసభ స్థానానికి చంద్రబాబు సిఫార్సు చేసినట్లు సమాచారం.ఈ స్థానం కోసం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రేపు మధ్యాహ్నం 3 గంటలలోపు కూటమి తరఫున ఎవరు నామినేషన్ దాఖలు చేస్తారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ రాజ్యసభ స్థానానికి రెండేళ్ల పదవీకాలం ఉంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

## ఇక అమరావతి అన్‌స్టాపబుల్

- మొదటి పేజీ తరువాయి

దత్తత తీసుకుని సహకరించాలని తాను విట్ యూనివర్సిటీ ఛాన్సలర్ జి. విశ్వనాథన్‌ను కోరినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అమరావతి విట్ వర్సిటీలో 'వి లాంచ్‌పాడ్ 2025 – స్టార్టప్ ఎక్స్ పో'లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. క్యాంపస్‌లో మహాత్మాగాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడారు.

## 2026 మార్చి నాటికి బందరు ఫిషింగ్ హార్బర్ పనులను పూర్తి చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని హోం మంత్రి అనిత అన్నారు. రాజధాని అమరావతి కోసం కోసం మహిళలు ఎన్నో పోరాటాలు చేశారని, గత ప్రభుత్వ హయాంలో వారిపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. జగన్ మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేశారని ఆమె విమర్శించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోదీ రాక ఒక శుభపరిణామమని ఆమె వ్యాఖ్యానించారు. అమరావతి పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి అనిత కోరారు.

# పద్మభూషణ్ అవార్డును అందుకున్న బాలకృష్ణ

**పెన్ పవర్ డెస్క్:**2025 సంవత్సరానికి గాను పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. నేడు సోమవారం (ఏప్రిల్ 28న) పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్?లో అట్టహాసంగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా పలు రంగాల్లో విశేష కృషిని అందించిన కళాకారులకు ఈ ప్రతిష్టాత్మక అవార్డులని అందించింది కేంద్రం. ఈ సందర్భంగా తెలుగు సినీ పరిశ్రమ నుండి హీరో నందమూరి బాలకృష్ణకి కేంద్రం పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది. దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మభూషణ్' పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా అందుకున్నారు. కళారంగంలో, సామాజిక సేవలకు గాను బాలకృష్ణకు పద్మభూషణ్ పుసరస్కారం వరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఐదు దశాబ్దాలపైబడి తెలుగు చలనచిత్ర సీమలో వెండితెరపై విభిన్న పాత్రలు పోషించాడు బాలకృష్ణ. ఆయన సినీ కెరీర్‌లో, 110 చిత్రాలలో, ఆయన తన అసాధారణ నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. అంతేకాకుండా హిందూపురం శాసన సభ్యుడిగా, బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్ గా ఎన్నో సేవలందిస్తున్నారు.2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 25న పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మొత్తంగా 139 మందికి ఈ అవార్డులు వరించాయి. అందులో 113 పద్మశ్రీ, 19 పద్మభూషణ్, ఏడు పద్మవిభూషణ్ పురస్కారాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి పద్మభూషణ్ అవార్డు బాలకృష్ణకు దక్కింది. సినీ విభాగంలో మరికొంత మందికి:టాలీవుడ్ వెటరన్ హీరోయిన్ శోభన కి కూడా పద్మభూషణ్ అవార్డు లభించింది. నటి శోభన హీరోయిన్?గా మాత్రమే కాకుండా భరతనాట్యం డ్యాన్సర్?గా పలు ప్రదర్శనలు ఇచ్చింది. తమిళ్ హీరో అజిత్ కుమార్?కి పద్మభూషణ్ అవార్డు వరించింది. కర్ణాటక నుంచి కేజీయఫ్ మూవీ ఫేమ్ నటుడు, రైటర్ అనంత్ నాగ్?కి పద్మభూషణ్ అవార్డు లభించింది. ఇక బాలీవుడ్ నుంచి అరజిత్ సింగ్ (పద్మశ్రీ), శేఖర్ కపూర్ (పద్మభూషణ్) తదితరులకి అవార్డులు లభించింది.

## భారత్-ఫ్రాన్స్ మధ్య 26 రఫేల్ యుద్ధ విమానాలకు ఒప్పందం

- మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో నేవీ వైస్ చీఫ్ అడ్మిరల్ కె. స్వామినాథన్ కూడా పాల్గొన్నారు.ప్రభుత్వం-ప్రభుత్వం మధ్య (G2G) కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, భారత నౌకాదళానికి 22 సింగిల్ సీట్ రఫేల్-ఎం జెట్స్, నాలుగు ట్విన్ సీట్ శిక్షణ విమానాలు అందనున్నాయి. ఈ యుద్ధ విమానాలు ప్రధానంగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ పై నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తాయి. కొద్ది రోజుల క్రితమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (CCS) ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపింది.ఒప్పందంలో భాగంగా విమానాలతో పాటు కొన్ని రకాల ఆయుధాలు, సిమ్యులేటర్లు, సిబ్బందికి శిక్షణ, ఐదేళ్ల పాటు పనితీరు ఆధారిత లాజిస్టిక్స్ సహకారం కూడా ఫ్రాన్స్ అందించనుంది. ఒప్పందం విలువలో ప్రాథమికంగా 15 శాతం మొత్తాన్ని భారత్ చెల్లించనుంది. మొత్తం 26 విమానాల డెలివరీ ప్రక్రియ 37 నెలల నుంచి 65 నెలల మధ్య పూర్తవుతుందని, 2031 నాటికి అన్ని జెట్స్ నౌకాదళానికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. సముద్ర లక్ష్యాలపై దాడులు, వాయు రక్షణ, నిఘా వంటి బహుళ ప్రయోజనకరమైన ఈ 4.5వ తరం రఫేల్ యుద్ధ విమానాలు అణ్వాయుధాలను ప్రయోగించగల సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. ఈ జెట్స్‌లో 70 కిలోమీటర్ల పరిధి గల ఎక్సోసెట్ ఏఎం39 యాంటీ-షిప్ మిస్సైళ్లు, 300 కిలోమీటర్లకు పైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగల స్కాల్ప్ గగనతలం నుంచి భూమి పైకి ప్రయోగించే క్రూయిజ్ క్షిపణులు, 120-150 కిలోమీటర్ల పరిధిలో శత్రు విమానాలను ఎదుర్కోగల అత్యాధునిక మెటియోర్ ఎయిర్ టు ఎయిర్ క్షిపణులను కూడా అమర్చనున్నారు. 2022లో నౌకాదళం నిర్వహించిన విస్తృత స్థాయి పరీక్షల్లో అమెరికాకు చెందిన ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్ కన్నా ఫ్రెంచ్ రఫేల్-ఎం మెరుగైన ప్రదర్శన కనబరిచింది. ఇప్పటికే భారత వైమానిక దళం (IAF) 36 రఫేల్ జెట్స్‌ను వినియోగిస్తుండటంతో లాజిస్టిక్స్, విడిభాగాలు, నిర్వహణలో సౌలభ్యం కూడా రఫేల్-ఎం ఎంపికకు కలిసొచ్చింది.ప్రస్తుతం నౌకాదళం వద్ద రష్యా నుంచి 2009 తర్వాత కొనుగోలు చేసిన 45 మిగ్-29కె యుద్ధ విమానాల్లో సుమారు 40 మాత్రమే ఉన్నాయి. ఇవి ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వాహక నౌకల నుంచి పనిచేస్తున్నాయి. అయితే, మిగ్-29కె విమానాలు తరచూ నిర్వహణ సమస్యలు, సేవల లభ్యత లోపాలతో ఇబ్బంది పడుతున్నాయి. మరోవైపు, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్న ట్విన్ ఇంజిన్ డెక్ బేస్డ్ ఫైటర్ (TEDBF) పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి మరో దశాబ్దం పట్టే అవకాశం ఉండటంతో, మధ్యంతర చర్యగా ఈ 26 రఫేల్-ఎం జెట్స్ కొనుగోలు చేయాలని నౌకాదళం నిర్ణయించింది. ఈ కొత్త యుద్ధ విమానాల చేరికతో హిందూ మహాసముద్రంలో భారత నౌకాదళ పటిష్టత మరింత పెరగనుంది.

# పర్యాటకులను కాపాడటంలో నేను విఫలమయ్యాను..

- మొదటి పేజీ తరువాయి

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ "గతంలో ఇలాంటి దాడులు చూశాం. కానీ, పహల్గామ్‌లోని బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి జరగడం గత 21 ఏళ్లలో ఇదే మొదటిసారి. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణ చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాపై ఉంది. ఆ పని నేను చేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరువయ్యాయి" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా, పర్యాటక శాఖ మంత్రిగా వారిని కాపాడలేకపోయానని ఆయన అంగీకరించారు.రాష్ట్ర హోదా అంశంపై మాట్లాడుతూ, "పహల్గామ్ ఘటన తర్వాత ఏ ముఖం పెట్టుకుని నేను రాష్ట్ర హోదాను డిమాండ్ చేయాలి? నా రాజకీయాలు అంత చౌకబారువి కావు. మేము గతంలో రాష్ట్ర హోదా అడిగాం. భవిష్యత్తులో కూడా అడుగుతాం. కానీ, 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన ఈ సమయంలో, దానిని కారణంగా చూపి రాష్ట్ర హోదా ఇవ్వండని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు" అని ఒమర్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని జాతి తీవ్ర వేదనలో ఉన్నప్పుడు కాకుండా, మరో సందర్భంలో లేవనెత్తుతానని ఆయన తెలిపారు.

ఉగ్రవాదంపై పోరులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఒమర్ అబ్దుల్లా నొక్కి చెప్పారు. "ప్రజలు మాకు మద్దతు ఇస్తేనే మిలిటెన్సీ, ఉగ్రవాదం అంతమవుతాయి. మేము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలం. కానీ దాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే మాకు ప్రజల మద్దతు కచ్చితంగా అవసరం. ఈ ఉద్యమానికి హాని కలిగించేలా ఎవరూ మాట్లాడకూడదు, ప్రవర్తించకూడదు" అని ఆయన అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో సమంతకు గుడికట్టిన వీరాభిమాని

**పెన్ పవర్ డెస్క్:**సినీ తారలపై అభిమానాన్ని చాటుకోవ డంలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. కొందరు కటౌట్లు, పాలాభిషేకాలతో తమ ప్రేమను చాటుకుంటే, మరికొందరు సేవా కార్యక్రమాలు చేపడుతుంటారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాకు చెందిన సందీప్ అనే అభిమాని తన ఆరాధ్య నటి సమంతపై ఉన్న ప్రేమను వినూత్నంగా ప్రదర్శించారు. ఏకంగా ఆమెకు ఓ ఆలయాన్ని నిర్మించి, అందులో సమంత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వివరాల్లోకి వెళితే, బాపట్లకు చెందిన ఈ వీరాభిమాని, నటి సమంతకు ఒక చిన్న ఆలయాన్ని నిర్మించారు. అందులో బంగారు రంగులో ఉన్న సమంత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం (ఏప్రిల్ 28) సమంత పుట్టినరోజు సందర్భంగా ఈ ఆలయం వద్ద ఆయన ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. సమంత విగ్రహం ముందు కేక్ కట్ చేసి, తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కొందరికి అన్నదానం కూడా చేశారు.ఈ అభిమాని సమంతకు గుడి కట్టడం, పుట్టినరోజున కేక్ కట్ చేసి, అన్నదానం చేయడం వంటి దృశ్యాలతో కూడిన వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలో ఉంది (వైరల్ అవుతోంది). ఈ వీడియోపై నెటిజన్లు, సమంత అభిమానులు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు అభిమాని చేసిన పనిని, నటిపై ఆయనకున్న ప్రేమను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇలాంటి అతి ఆరాధన అవసరమా అని ప్రశ్నిస్తూ, విమర్శలు చేస్తున్నారు.గతంలో తమిళనాడులో నటీమణులు కుష్బూ, నయనతార, హన్సిక వంటి వారికి కూడా కొందరు అభిమానులు గుడులు కట్టిన సందర్భాలున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో సమంతకు అభిమాని గుడి కట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ప్రస్తుతం నటిగా విరామం తీసుకున్న సమంత, నిర్మాతగా వ్యవహరిస్తున్న ఓ సినిమాతో త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆమె త్వరలోనే ఓ భారీ చిత్రంతో నటిగా రీఎంట్రీ ఇవ్వనుందనే ప్రచారం కూడా జరుగుతోంది.

# కోవిడ్ టీకాలు: దీర్ఘకాలిక దుష్ప్రభావాలు లేనట్టే!

- మొదటి పేజీ తరువాయి

పాటు నిశితంగా పరిశీలించారు. వారి శరీరాల్లోని 167 జీవక్రియ మార్కర్లను 28 వేర్వేరు సమయాల్లో పరీక్షించారు. ఈ పరిశీలనలో వ్యాక్సిన్‌ల కారణంగా ఇన్‌ఫ్లమేషన్ సూచికలు, గుండె జబ్బుల ప్రమాద కారకాలు, శక్తి జీవక్రియకు సంబంధించిన అణువులు వంటి కీలక ఆరోగ్య అంశాలపై ఎటువంటి అర్థవంతమైన ప్రభావం కనిపించలేదని తేలింది.

"కోవిడ్-19 వ్యాక్సిన్‌లు సురక్షితమైనవని, అవి గణనీయమైన జీవక్రియ మార్పులకు కారణం కావని ఈ వాస్తవ ప్రపంచ అధ్యయనం చూపుతోంది. మా ఫలితాలు వ్యాక్సిన్‌లపై ఉన్న అపోహలను, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడానికి, టీకాలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచడానికి సహాయపడతాయి," అని అధ్యయన ప్రధాన రచయిత, అసోసియేట్ ప్రొఫెసర్ రూయ్ లెంగ్ లూ తెలిపారు.'జర్నల్ ఆఫ్ మాలిక్యులర్ మెడిసిన్'లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, వ్యాక్సిన్ తీసుకున్న వారిని, అసలు కోవిడ్ సోకని వారితో (కంట్రోల్ గ్రూప్), అలాగే తేలికపాటి కోవిడ్ ఇన్ఫెక్షన్ వచ్చిన వారితో పోల్చి చూశారు. వ్యాక్సిన్ తీసుకున్న వారి జీవక్రియ ప్రొఫైల్స్, కంట్రోల్ గ్రూప్‌తో చాలా దగ్గరగా సరిపోలాయని, దీన్నిబట్టి టీకాలు శరీరంలో పెద్ద జీవసంబంధ మార్పులను ప్రేరేపించవని స్పష్టమైందని అధ్యయనం పేర్కొంది.మూడవ డోస్ తర్వాత ఇన్‌ఫ్లమేషన్‌కు సంబంధించిన 'కీమోకైన్ ఐపీ10' మార్కర్‌లో స్వల్పమైన, తాత్కాలిక పెరుగుదల కనిపించినప్పటికీ, అది సాధారణ పరిధిలోనే ఉందని, తదుపరి డోస్‌కు ముందే సాధారణ స్థితికి చేరుకుందని పరిశోధకులు గుర్తించారు. అయితే, తేలికపాటి కోవిడ్ ఇన్ఫెక్షన్లు కూడా వ్యాక్సిన్‌ల కంటే ఎక్కువ స్పష్టమైన జీవక్రియ మార్పులకు కారణమవుతున్నాయని రూయ్ లెంగ్ లూ వివరించారు. ఎన్ని డోసులు తీసుకున్నా, కోవిడ్ ఇన్ఫెక్షన్ వల్ల కలిగే జీవసంబంధ మార్పులు వ్యాక్సిన్ల వల్ల కలగవని ఆమె నొక్కి చెప్పారు.ఈ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, మరింత విస్తృతమైన, విభిన్న సమూహాలతో మరిన్ని పరిశోధనలు అవసరమని బృందం అభిప్రాయపడింది.

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సుప్రీంకోర్టులో మరోసారి ఊరట

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ హయాంలో చోటుచేసుకు న్న లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొం టున్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సుప్రీంకోర్టులో మరోసారి స్వల్ప ఊరట లభించింది. మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ ను ఈరోజు సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయనను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కొనసాగుతుందని తెలిపింది.

సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ కౌంటర్ దాఖలు చేసింది. దీంతో ఆ కౌంటర్ ను పరిశీలించి రీజైండర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని మిథున్ రెడ్డి తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. దీంతో తదుపరి విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ప్రారంభించిన...ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి/పెన్ పవర్/ఏప్రిల్ 28 :** శ్రీకాళహస్తి నియోజకవర్గం శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయం నందు కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రారంభించారు.ముందుగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కి పురపాలక సంఘ అధికారులు మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పహాల్గం ఉగ్ర దాడి ఘటనలో 26 మందిని అతి దారుణంగా కిరాతంగా పాకిస్తాన్ వాళ్ళు చంపేశారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు ఎమ్మెల్యే మౌనం పాటించారు. బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ఇల్లు బాగుండాలంటే ఇంట్లో మహిళ ఆర్థికంగా గట్టిగా ఆరోగ్యంగా ఉండాలి అని చంద్రబాబు నాయుడు ఒక మంచి ఆలోచనతోని ఉమెన్ ఎంపవర్మెంట్ సేవలో బ్రహ్మాండంగా మహిళలు ముందుకు దూసుకుపోవాలి అనే ఒక ఉద్దేశంతోనే మరి ఈ టైలరింగ్ కార్యక్రమం అనేది కుట్టుమిషన్లు ఇవ్వడం అనేది మంచి ఆలోచనలు చేశారు.శ్రీకాళహస్తిలో ఇప్పటికీ 600 కొట్టు మిషిన్లు ఇవ్వండం జరిగింది అని, తెలిపారు. ఇంకా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారుఈ కార్యక్రమంలో అధికారులు, ఆయా మండల నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## తిరుపతి ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం

### స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్





**పాకాల, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** నేటి మధ్యాహ్నం తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిఎంఓ ఆదేశాల మేరకు ఘటన స్థలానికి హుటాహుటిన వెళ్లి ప్రమాద స్థలానికి వెళ్లి జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు తో కలిసి ప్రమాద తీరును పరిశీలించి, స్విమ్స్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సందర్శించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉంటామని, క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్, 28 :** మే 2వ తేది నుండి జూన్ 12వ తేది వరకు 12 రకాల థీమ్స్ తో కిషోర్ వికాసం ప్రత్యేక కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి రాజుకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జిల్లా స్థాయి కిషోర్ వికాస సమ్మర్ క్యాంపు కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, ఐసిడిఎస్ పిడి లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేయడం ద్వారానే వాటిని పూర్తి స్థాయిలో రూపుమాపే అవకాశం ఉంటుందన్నారు. కిషోర్ వికాస సమ్మర్ క్యాంపు కార్యక్రమం ద్వారా మే 2వ తేది నుండి జూన్ 12వ తేది వరకు 12 రకాల థీమ్స్ లలో ఎంఎస్కే, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, విఓఎలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా 15 సం.ల నుండి 18 సం.ల మధ్య ఉన్న బాలికలతో పాటు వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా జూన్ 4వ తేది నుంచి జూన్ 10వ తేది వరకు గ్రామ పంచాయతీ పరిధిలో కూడా చిల్డ్రన్ గ్రామ సభ నిర్వహించి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలన్నారు. వివాహాలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయడం ద్వారా బాల్య వివాహాల పరిమితి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థినిలు డ్రాప్ ఔట్స్ అయితే వారిని తిరిగి పాఠశాల/కళాశాలలో చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, ఎపిఎంలు, సూపర్వైజర్లు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టరేట్ మరియు నియోజకవర్గ కమాండ్ కంట్రోల్ రూమ్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు సంబంధించి అధికారుల వారీగా ఎంతమందికి వ్యక్తిగతంగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించాము, ఎంతమంది వ్యక్తిగతంగా పరిష్కరించారు అనే దానిపై ఫోటోలతో ఆధారాలు అందజేయాలన్నారు. మండల స్థాయిలో కోఆర్డినేషన్ కమిటీలను యాక్టివేట్ చేయాలన్నారు. పీజిఆర్ఎస్ సంతృప్తి స్థాయికి సంబంధించిన నివేదిక అందించాలని, పీజిఆర్ఎస్ సిటిజన్ ఫీడ్బ్యాక్ యాప్ ను మానిటర్ చేయాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలు మళ్ళీ మళ్ళీ అందిస్తున్నామని అర్జీదారులు చెప్తున్నారని, మండల, డివిజన్ స్థాయిలో అర్జీల పరిష్కారం గట్టిగా చేపట్టాలన్నారు. రిజిస్టర్ శాఖకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పరిశీలన చేయాలన్నారు. అర్జీదారులు అడిగిన దాని ప్రకారం పరిష్కారం చేయాలని ఆదేశించారు. విఐపి సూచనలు, సీఎం పిటిషన్లు, ఎస్సీ, ఎస్టీ కమిషన్, తదితర అర్జీలకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనేది తెలపాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, సిపిఓ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిటిసి వీర్రాజు, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్, పిజిఆర్ఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### - కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్, 28 : వచ్చే 4వ తేదిన జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ ) యూజి పరీక్ష నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ పలు అంశాలపై సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హై స్కూల్, టేక్కే జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర కళాశాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షలలో 1172 మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లో అనుమతి ఇస్తారని నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య చర్యలు, త్రాగు నీటి వసతి కల్పించాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన బెంచులు ఏర్పాటు చేయాలని డిఈఓను సూచించారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లు, పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం





**అమరావతి: పెన్ పవర్ ఏప్రిల్ 28 :** తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పాకాల మండలం తోటపల్లి వద్ద కంటైనర్‌ను కారు ఢీ కొన్న ఘటనలో కారులోని వారు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఐదుగురు చనిపోగా మరికొందరు గాయపడ్డారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లా అధికారులను సిఎం ఆదేశించారు. క్షతగాత్రులకు రుయా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

## భారీగా ఎర్రచందనం స్వాధీనం.. ఏడుగురి అరెస్ట్



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 28 :** శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో సోమవారం 72 ఎర్ర చందనం దుంగలతో పాటు ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. నిందితులతో పాటూ ఒక కారు, ఒక లారీని పట్టుకోగా దుంగల విలువ రూ.2.5కోట్ల వరకు ఉంటుందన్నారు. నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా.. పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉచితంగా సమ్మర్ క్లాసులు వినియోగించుకోవాలి





**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 27 :** శ్రీ భగవాన్ సత్య సాయి బాబా వారి అమ్మ ఈశ్వరమ్మ , వర్ధంతిని పురస్కరించుకొని 3వ రోజు అయిన 27- 4-2025వ తేదీ వేసవి ఫ్రీ సమ్మర్ క్యాంప్ జరిగింది. ఈ ఉచిత క్యాంపుకు ఈరోజు ప్రత్యేక అతిధిగా ప్రముఖ మోటివేటర్ మరియు బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గౌరవనీయులు బి.చంద్రప్ప, హాజరు అయినారు. వారు వారి యొక్క మోటివేషన్ క్లాసులో బాబా, ప్రధాన ఆశయా లైనప్రేమను గురించి సేవ ను గురించి మానవాళికి స్వామి చేసిన సేవలు అయినా విద్యాదానము నీటి దానము వైద్య దానము గురించి ప్రత్యేకంగా చెప్పడం జరిగింది. చిన్నపిల్లలకు తన యొక్క మోటివేషన్ క్లాసులో చిన్నప్పటి నుంచి బాల వికాస్ విద్యా విధానం అనుసరిరంచుతూ క్రమశిక్షణ కలిగినటువంటి , మానవతా విలువల కలిగిన, సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ పిల్లలు చిన్నతనం నుంచే అలవర్చుకుని క్రమశిక్షణ కలిగి ఉండాలని. ఇష్టపడి కష్టపడి చదివితే ఏ రకంగా తయారవుతారు ,లేని యెడల వాళ్ళ జీవితం ఎట్లాఉంటుంది ,అనే విషయాలను చిన్న కథల రూపంలో చెప్పి పిల్లలను పెద్దలందరినీ కూడా అలరింప చేశారు. స్వామి ఇచ్చిన మన శరీరంలోని ఒక్కొక్క భాగాన్ని గురించి ఎంత విలువైంది ఈ విలువైనది మనకు స్వామి ఫ్రీగా ఇచ్చినారు దీని సక్రంగా వినియోగించుకోవాలని అటువంటి విషయాలను చక్కగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సత్య సాయి బాబా చారిటీ ట్రస్ట్ నిర్వాహకులు పాండు రంగయ్య,వాసు దేవరావు, చెంగయ్య, నాగభూషణం, మల్లీశ్వరి, ప్రేమ కుమారి,మరియు విద్యార్థిని, విద్యార్థులు, సత్య సాయిబాబా భక్తులు, విద్యార్థుల తల్లితండ్రులు హాజరయ్యారు.

## విద్యార్థులపై ఎలుకలు దాడి ఘటనపై చర్యలు తప్పవు

### మంత్రి నారా లోకేష్ దృష్టికి : ఎమ్మెల్యే దగ్గుపాటి





**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** అనంతపురం నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులపై ఎలుకలు దాడి చేసిన సంఘటన మీద విచారణ జరుగుతోందని, ఇందులో బాధ్యులపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కళాశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం కళాశాల ఆవరణం, వసతి గృహం చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులనడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఒకే రూమ్ లో 20 మంది వరకు విద్యార్థులు ఉన్నామని తెలిపారు. అలాగే తాగునీటి పైప్ లైన్ సమస్య ఉందని కూడా చెప్పారు. వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో తాగునీటి పైప్ లైన్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ తర్వాత కుకింగ్ రూమ్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంపై ఆయన అక్కడ సిబ్బందిని మందలించారు. ఇలాంటి పరిస్థితి ఉంటే విద్యార్థులు అనారోగ్యానికి గురికారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతి నెల సడన్ విజిట్స్ ఉంటాయని, ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలతో పాటు వసతి గృహంలో అన్నీ పరిశీలించామని, 2014 నుంచి 19 మధ్య కాలంలో జరిగిన నిర్మాణాలే ఇక్కడ కనిపిస్తున్నాయన్నారు. చాలా చోట్ల అసంపూర్తిగా నిర్మాణాలు ఉన్నాయని, గత ఐదేళ్లలో చిన్న అభివృద్ధి కూడా ఇక్కడ జరగలేదని ఆయన అన్నారు. కాంపౌండ్ వాల్ సమస్య కూడా తన దృష్టికి వచ్చిందన్నారు. వీటన్నింటిని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. విద్యాలయాల్లో చిన్న సమస్య ఉన్నా మంత్రి నారా లోకేష్ స్పందిస్తున్నారని.. ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ విద్యాలయాలను మారుస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ డైరెక్టర్లు, డిగ్రీ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1.50 కోట్లు

### సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విరాళం




**తిరుమల పెన్ పవర్ ఏప్రిల్ 28 :** సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1.50 కోట్లు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఇటీవల విరాళంగా అందించింది.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళం



**తిరుమల పెన్ పవర్ ఏప్రిల్ 28 :** చెన్నైకు చెందిన పాన్ ప్యూర్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆదివారం శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళంగా అందించింది.

## రక్త నాళాల వైద్య శిబిరము శుభదాయకం

### శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్



**పెన్ పవర్ ధర్మవరం ఏప్రిల్ 28 :** ఉచిత రక్త నాళాల వైద్య శిబిరమునకు విశేష స్పందన రావడం శుభదాయకమని శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ నామాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని మాధవ నగర్ లో గల శ్రీ సత్య సాయి భజన మందిరము నందు ఉచిత రక్తనాళాల వైద్య శిబిరమును నిర్వహించారు. అనంతరం నామ ప్రసాద్ మాట్లాడుతూ భారత దేశపు అతిపెద్ద వాస్కులర్ హాస్పిటల్–హైదరాబాద్ వారి సహకారంతో ఈ శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. 5000 రూపాయల విలువైన రక్తనాళాల సర్జన్ కన్సల్టేషన్ అండ్ వైద్య పరీక్షలను ఉచితంగా రోగులకు అందించడం జరిగిందని తెలిపారు. పుట్టపర్తి బాబా ఆశీస్సుల మేరకు ఈ శిబిరము నిర్వహణ మాకెంతో ఆనందము, తృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ శిబిరంలో రక్తనాళాల వైకల్యం, అర్తేరియా వెనస్ ఫిస్టులా, రక్తం గడ్డకట్టుట, కాళ్లు వాపు రావడం, ఉబ్బిన నరాలు, స్పైడర్, కాళ్లు లో రక్తం సరఫరా లేకపోవడం, సొరియాసిస్, మెదడుకు తగినంత రక్త సరఫరా లేకపోవడం లాంటి జబ్బులకు వైద్య చికిత్సలను హైదరాబాద్ వైద్యులు డాక్టర్ సోమాచారి, డాక్టర్ స్వాతి లచే ఉచితంగా అందించడం జరిగిందన్నారు. ఇటువంటి శిబిరం నిర్వహణ పట్ల రోగులు కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసియన్ వాస్కులర్ హాస్పిటల్ హైదరాబాద్ జోనల్ ఇన్చార్జ్ సురేంద్ర, బాబా సేవకులు చంద్రశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి నారాయణ హత్య దిగ్భ్రాంతికరం : డా.తులసి రెడ్డి



**వేంపల్లి పెన్ పవర్ 28 :** కర్నూల్ జిల్లా,ఆలూరు అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ,మాజీ జెడ్పిటిసి చిప్పగిరి లక్ష్మి నారాయణ ఆదివారం హత్యకు గురి కావడం తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను కలిగించిందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. లక్ష్మి నారాయణ చాలా ఉత్తముడని, కాంగ్రెస్ పార్టీ కి క్రమశిక్షణతో,అంకిత భావం తో కృషి చేశాడని కొనియాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర విజయవంతానికి ఎంతో కృషి చేశారన్నారు. హంతకులను పట్టుకొని చట్టపరంగా శిక్షించించాలని తులసి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. లక్ష్మి నారాయణ పవిత్రాత్మకు ప్రశాంతిని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని ప్రకటించారు.

## బీసీ సంక్షేమ వసతి ...

### పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రతిభ...



**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ టెన్త్, ఇంటర్ లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్లో బి సి సంక్షేమ వసతి గృహాలకు చెందిన విద్యార్థులు జిల్లా కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను అభినందిస్తూ ఇంకా బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, జిల్లాకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలనీ విద్యార్థులకు సూచించారు. అంతరం విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. బీసీ సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు సి మాధురి – 585, ఎం పల్లవి – 561, కే వెంకటేష్ – 559, ఏ సిరి – 555, ఎస్.కె ముజీఫ్ – 552 ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాస్థాయిలో బీసీ వెల్ఫేర్ కళాశాల లోని విద్యార్థులు సాధించిన అత్యుత్తమ మార్కుల వివరాలు పి లక్ష్మీప్రసాద్ – 981, ఎన్ ప్రీతిజింతా – 957

## విద్యార్థి యోగేష్ మృతికి మదర్ థెరిసా కళాశాల యాజమాన్యానిదే బాధ్యత

– విద్యార్థి మృతదేహాన్ని మోసుకుంటూ పట్టణంలో నిరసన – 4 కిలోమీటర్లు మోసుకుంటూ కళాశాల వద్దకు

– పోలీసులతో బంధువుల తీవ్ర వాగ్వాదం





**పలమనేరు ఏప్రిల్ 28, (పెన్ పవర్) :** విద్యార్థి యోగేష్ మృతికి మదర్ థెరిసా కళాశాల యాజమాన్యానిదే బాధ్యత అని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. శనివారం మేలుమాయి పంచాయతీకి సమీపంలోని మదర్ థెరిసా కళాశాల నందు కుప్పం నియోజకవర్గ పరిధి శాంతిపురం మండలం గెసికపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు యోగేష్ (16) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి పరీక్షలు రాయగా,ఇటీవల విడుదలైన ఫలితాల్లో కొన్ని సబ్జెక్టులలో తప్పినట్లు తెలిసింది. కాగా ఇందుకు సంబంధించిన సబ్జెక్టులపై సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి కళాశాలలోనే నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు శనివారం హాజరై,విరామ సమయంలో కళాశాలలోని హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కాగా పరీక్షలలో తప్పినప్పటి నుండీ విద్యార్థి యోగేష్ తీవ్రమైన ఒత్తిడికి గురైనట్లు తెలిసింది. మృతి చెందడానికి ముందు మిస్ యూ నాన్నా అని ఒక నోట్ రాసి పెట్టినట్లు కూడా తెలిసింది.మృతి చెందిన విద్యార్థిని పంచనామా నిమిత్తం పోలీసులు పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థి మృతదేహాన్ని మోసుకుంటూ 4 కిలో మీటర్లలో ఉన్న కళాశాల వద్దకు.. పలమనేరు ఏరియా ఆసుపత్రి నుండీ విద్యార్థి మృతదేహాన్ని బంధువులు మోసుకుంటూ 4కిలోమీటర్లు పట్టణంలో నుండీ గంగవరం లోని మదర్ థెరిసా కళాశాల వద్దకు నినాదాలు చేస్తూ పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు.యాజమాన్యము దిగివచ్చి న్యాయం చేయాలని, ఒకానొక సందర్భంలో కళాశాలలోకి దూసుకుపోతున్న జనాన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం.

**యోగేష్ మృతిపై అనుమానం ఉంది: బంధువులు :** విద్యార్థి మృతిపై కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనిపై మాకు పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. కళాశాలలో ఉండి చదువు కొంటున్న తమ కుమారుడు అనుమానాస్పద స్థితిలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు యాజమాన్యం చెబుతున్నారని,అక్కడ ఏమి జరిగినా కళాశాల యజమాన్యానికి తెలియదా అని అన్నారు.ఇంత జరుగుతున్నా మమ్మల్ని కళాశాల వద్దకు వెళ్లవద్దని పోలీసులు అడ్డగించడం ఏంటని నిలదీశారు.

సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కుప్పం నియోజక వర్గ పరిధి దళిత విద్యార్థికి అన్యాయం జరిగితే అటు మదర్ థెరిసా కళాశాల యాజమాన్యం ఇటు పోలీసులు కలిసి మాకు అన్యాయం చేస్తున్నారని గట్టిగా ఆరోపించారు.దీంతో డీఎస్పీ దేగల ప్రభాకర్ మరియు సి.ఐ ప్రసాద్ అక్కడకు చేరుకుని భాదితులకు న్యాయం చేస్తామని చెప్పడంతో ఉద్రిక్తత వాతావరణం చల్లబడింది.

## ఘనంగా మానస నృత్య కళా కేంద్రం వార్షికోత్సవం







**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 28 :** ధర్మవరం పట్టణంలో ఉన్నటువంటి చెన్నకేశవ స్వామి దేవస్థానం నందు మానస నృత్య కళాకేంద్రం వారి 5వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమం నందు మానస నృత్య కళాకేంద్రం వారిఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణ" నృత్యరూపకం' నిర్వహించడం జరిగింది ..ఒక గంట సమయం పాటు నిర్విరామంగా ఈ నృత్యరూపకం చేశారు. మొత్తం 25 మంది చిన్నారులుచే నృత్య ప్రదర్శన నిర్వహించారు.. కార్యక్రమం అనంతరం ప్రముఖ నాట్యచారిని ముంగుర హరిణి చేతుల మీదుగా అలానే పెద్దిపోగు ఆనంద్ బాపనపల్లి వెంకటస్వామి చేతుల మీదుగా గురువు మానసకి సన్మానం చేశారు. ఇంతటి గొప్ప అవకాశాన్ని పొందినందుకు మానస ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. వెంకటేశ్వర స్వామి అవతారంలో సోమశేఖర్, అలమేలుమంగమ్మగా గురువు మానస, లక్ష్మీదేవిగా హరిణి, అన్నమయ్యగా కె.ఎస్.కృష్ణ చెయ్యటం జరిగింది.

## పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడమే మా లక్ష్యం..

### శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి సంఘం



ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 28 : పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడమే మా లక్ష్యము అని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షులు బంధనాథం రమణ, కార్యదర్శి సిరివెళ్ల రాధాకృష్ణ, నిర్వాహకులు దాసరి వెంకటేశులు (చిట్టి) తెలిపారు. ఈ శిబిరం దాసరి వెంకటేశులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ శిబిరం పట్టణంలోని తొగటవీధి లో గల శ్రీ శాంత కళా చౌడేశ్వరి దేవి ఆలయములోని ఆవరణములో జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి 273 మంది రోగులకు ప్రత్యేక వైద్య నిపుణులు చే వైద్య చికిత్సలతో పాటు ఒక నెలకు సరిపడు మందులను కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. చివర దాతలుగా కీర్తిశేషులు దాసరి కేశమ్మ, కీర్తిశేషులు దాసరి పెద్ద వెంకటేశులు జ్ఞాపకార్థం వీరి కుమారుడు నారాయణస్వామి అండ్ సన్స్, దాసరి కమలాక్షి వ్యవహరించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ వివేక్ కుల్లాయప్ప, డాక్టర్ వెంకటేశులు, డాక్టర్ సాయి శ్వేత, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ విట్టల్, డాక్టర్ మహేష్, డాక్టర్ సతీష్ లు వైద్య చికిత్సలను అందించడంతోపాటు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన పలు అంశాలను రోగులకు వివరించడం జరిగిందని తెలిపారు. తదుపరి డాక్టర్ వినయ్ ద్వారా మందులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దాతలు మాట్లాడుతూ ఇటువంటి శిబిరంలో మమ్ములను భాగస్వామ్యం చేసిన కమిటీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార దర్శి బండి నాగరాజు, పెద్దకోట్ల రాజు, పెద్దకోట్ల భాస్కర్, బండి ఆంజనేయులు, కాచర్ల నారాయణస్వామి మామిళ్ల అశ్వత్త నారాయణ, బండి సాయి, బండి పవన్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల ప్రజలందరూ చక్కటి శ్రద్ధను కనపరచాలి

– డాక్టర్ కె.పూర్ణచంద్ర



**పెన్ పవర్ ధర్మవరం ఏప్రిల్ 28 :** ఆరోగ్యం పట్ల ప్రజలందరూ చక్కటి శ్రద్ధను కనపరచాలని పల్మలాలజిస్ట్ డాక్టర్ కె. పూర్ణచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పుట్టపర్తి రోడ్, సాయిబాబా గుడి వద్ద గల స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఊపిరితిత్తుల జాతి జబ్బుల ఉచిత వైద్య శిబిరమును హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊపిరి తిత్తులు, చాతి జబ్బుల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణ చంద్ర వైద్య చికిత్సలను పూర్తిగా ఉచితంగా అందించడం జరిగిందన్నరు. ఈ శిబిరంలో 88 మందికి ఉచితంగా వైద్య చికిత్సలతో పాటు మందులు కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా అవసరమైన పరీక్షలకు 50 శాతంతో మాత్రమే రాయితీని ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరమును ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకొని ఆరోగ్యం పట్ల తీసుకున్న శ్రద్ధ పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి శిబిరమును నిర్వహించడం పట్ల కూడా ప్రజలు కృతజ్ఞతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియాకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ బాబా ఫక్రుద్దీన్, దిల్దార్, నర్సులు పాల్గొన్నారు.

## 29న కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి పెన్ పవర్ ఏప్రిల్ 28 :** చిత్తూరు జిల్లా కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో ఏప్రిల్ 29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో మే 5 నుండి 13వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఉదయం 8 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 11 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు.

**ఆలయ చరిత్ర :** చిత్తూరు జిల్లా గంగవరం (మం) కీలపట్ల గ్రామంలో వెలసిన శ్రీ కోనేటిరాయ స్వామి దేవాలయం అతి పురాతనమైన చారిత్రక ప్రసిద్ధి కలిగిన దేవాలయం. ఈ స్వామి వారిని భృగు మహర్షి ప్రతిష్ట చేసి ఆరాధించగా, పాండవ మధ్యముడు అర్జునుడి ముని మనవడు జనమేజయ మహారాజు గుడి కట్టించారు. తర్వాత కాలంలో చోళ, పల్లవ, విజయనగర సామ్రాజ్యాధీశుల ఏలుబడిలో విశేష పూజలు అందుకుని తర్వాత మహమ్మదీయుల దండయాత్రలకు భయపడి గ్రామస్తులు స్వామి వారిని కోనేటిలో దాచి ఉంచారు. ఆ తర్వాత కాలంలో చంద్రగిరి సంస్థానాధీశుల సామంతులు శ్రీ బోడికొండమ నాయుడు గారికి కలలో సాక్షాత్కరించి కోనేటిలో ఉన్న స్వామివారిని తిరిగి ప్రతిష్టించమని కోరినారు. ఆ విధంగా కోనేటి నుండి ప్రతిష్ట చేయబడి శ్రీ కోనేటి రాయ స్వామిగా ప్రసిద్ధి చెందినారు. అన్నమయ్య కీర్తనలలో శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయం ఈ గ్రామంలో మాత్రమే ఉన్నది. కోరినదే తడవుగా కొండంత వరములను ప్రసాదించే శ్రీ కోనేటిరాయ స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శ్రీ వైఖానస ఆగమోక్త ప్రకారముగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** ప్రభుత్వం అనంతపురం జిల్లాకు నూతన అసిస్టెంట్ కలెక్టర్ ను కేటాయించింది. ఈ మేరకు సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ను నూతన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. అనంతరం నూతన అసిస్టెంట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను కలిసి పూల మొక్క అందజేశారు. తదనంతరం కలెక్టరేట్ లోని అసిస్టెంట్ కలెక్టర్ ఛాంబర్ లో నూతన అసిస్టెంట్ కలెక్టర్ గా సచిన్ రహర్, ఐ.ఏ.ఎస్ బాధ్యతలు స్వీకరించారు. రాజస్థాన్ కు చెందిన సచిన్ రహర్ 2024 ఐ.ఏ.ఎస్ బ్యాచ్‌కు చెందినవారు.

## క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్ధి

**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 28 :** క్రీడాకారులు కొత్తగా నిర్మించిన రాయల స్పోర్ట్స్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్ధి పేర్కొన్నారు. ఆదివారం మిలిటరీ కాలనీ సమీపంలో రాయల స్పోర్ట్స్ క ను జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్ధి, తెలంగాణ రాష్ట్రం లోని మేడ్చల్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి మాట్లాడుతూ రాయల స్పోర్ట్స్ ను కర్నూలు లో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాయల స్పోర్ట్స్ ను రాయల్ గా నడిపించాలని, జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకావాలన్నారు. క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రికెట్ ఆటలో బాగా రాణించి కర్నూలు జిల్లాకు మంచి పేరు తేవాలని జడ్జి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పై.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఈరోజు రాయల స్పోర్ట్స్ క్రికెట్ గ్రౌండ్ ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఈ స్టేడియం ను వినియోగించుకొని, మంచి నైపుణ్యం సాధించి, క్రికెట్లో రాణించాలన్నారు. ఈ కాంప్లెక్స్ లో స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మించి, ఒక స్పోర్ట్స్ కాంప్లెక్స్ గా తయారవ్వడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రక్కనే ఉన్న ఈ స్థలం దాదాపుగా ఐదు ఎకరాల 50 సెంట్లు భూమిని ఎంసి బీచ్పల్లి గారు, వారి సోదరులు మరియు వారి కుటుంబ సభ్యులు ,తెలంగాణ రాష్ట్రం లోని మేడ్చల్, జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీదేవి గారు ఈ స్థలాన్ని రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు, ఈ కాంప్లెక్స్ ను కర్నూలు జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఈ రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం వలన క్రికెట్ క్రీడాకారులకు మంచి అవకాశం అని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రికెట్ గేమ్స్ నందు మంచి నైపుణ్యం సంపాదించుకోవాలని ఎస్పీ క్రీడాకారులకు సూచించారు.



**ఉత్సాహంగా క్రికెట్ ఆడిన కలెక్టర్, ఎస్పీ :** రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన అనంతరం, కలెక్టర్, ఎస్పీ క్రికెట్ ఆడారు. ఇరు జట్లకు నాయకత్వం వహించి ఉత్సాహంగా క్రికెట్ ఆడి యువతలో స్ఫూర్తి నింపారు.. క్రికెట్ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ ఆర్డిఓ సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు,డిఎస్ డివో భూపతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, లాయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగుల దాడి ....
# ప్రజలను, పంట పొలాలను కాపాడాలి

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**

**వేంపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 28 :** గత కొంత కాలంగా రాష్ట్రం లో ఏనుగుల భీభత్సం ఎక్కువైందని, వీటి బారినుండి ప్రజలను,పంట పొలాలను కాపాడాలని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అడవుల్లో ఆహారం,నీటి కొరత కారణంగా,వివిధ ఏనుగుల గుంపుల మధ్య పోరాటం కారణంగా అడవుల నుండి ఏనుగులు సమీపం లోని గ్రామాల్లోకి రావడం, పంటలు ధ్వంసం చేయడం,కనిపించిన మనుష్యులను తొండం తో విసిరి వేసి చంపడం,లేదా కాళ్ళతో తొక్కి చంపడం చేస్తున్నాయ్. 18-1-2025 న తిరుపతి జిల్లా,చంద్రగిరి మండలం,కందుల వారి పల్లి ఉప సర్పంచ్ ,టీడీపీ మండల నాయకుడు రమేష్ చౌదరిని ఏనుగులు కాళ్ళతో తొక్కి చంపాయి. 25-4-2025 న తిరుపతి జిల్లా చిన్న గొట్టి గల్లు మండలం ,చిత్తే చర్ల పంచాయితీకి చెందిన 65 యేండ్ల రైతు సిద్ధయ్య మిరప పంటకు నీరు కట్టి వస్తుండగా ఆయనను తొక్కి చంపాయి. ఉమ్మడి చిత్తూర్ జిల్లాలోని కుప్పం,పలమనేరు,పుంగనూరు,చంద్రగిరి యోజకవర్గాలలో,విజయనగరం జిల్లాలో,రాష్ట్రం లోని అనేక ప్రాంతాలలో ఏనుగుల దాడులు తరచుగా జరుగుచున్నాయ్. 2011 నుండి నేటివరకు ఒక్క ఉమ్మడి చిత్తూర్ జిల్లా లోనే ఏనుగుల దాడిలో 23 మంది చనిపోయారు.అనేక మంది గాయపడ్డారు.233 ఎకరాలలో పంట నాశనమయింది. దాదాపు పహాల్గాం మృతుల సంఖ్య తో సమానంగా ఏనుగుల దాడిలో మృతుల సంఖ్య వుండడం శోచనీయం. ప్రజలకు కంటి మీద కునుకు లేదు. కర్నాటక రాష్ట్రం నుండి ఈ సమస్య పరిష్కారం కోసం ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ తెచ్చిన కుంకీ ఏనుగులు ఏమయ్యాయో తెలియకుండా వుంది.

ముఖ్య మంత్రి గారు పదేపదే స్వర్ణాంధ్ర,సంతోష ,ఆరోగ్య,సంపద ఆంధ్ర అంటూ డైలాగులు చెబుతున్నారు.అవి దేవుడెరుగు.ముందు సొంత జిల్లాలో,సొంత నియోజకవర్గం కుప్పం లో ఏనుగుల బెడద నుండి ప్రజలను,పంట పొలాలను కాపాడాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**అరటి రైతులను ఆదుకోవాలి :** రాష్ట్రం లో 1,44,987 ఎకరాలలో రైతులు అరటి పంట వేశారు. కడప,అనంతపురం,నంద్యాల,తూర్పు గోదావరి,కోనసీమ,పార్వతీ పురం తదితర జిల్లాలలో అరటి పంట వేశారు. ఎకరాకు దాదాపు రు 2 లక్షలు పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తుంది. టన్నుకు రు 10 వేలు ధర పలికితే అసలు వస్తుంది. కానీ సింగపూర్,మలేషియా,ఇండోనేషియా తదితర దేశాలకు ఎగుమతి నిలిచిపోయిన కారణంగా ధర అమాంతం పడిపోయింది.టన్నుకు రు5 వేలకు కూడా కొనడం లేదు. రైతులకు ఎకరాకు లక్షా రూపాయలు నష్టం వస్తోంది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**గోకులం బిల్లులు చెల్లించాలి :** రైతులు 10శాతం,ప్రభుత్వం 90శాతం భరించే విధంగా గోకులం,మినీ గోకులం షెడ్లు,రైతులు 30శాతం,ప్రభుత్వం 70 శాతం భరించే విధంగా గొర్రెల షెడ్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

రైతులు అధిక వడ్డీకి అప్పు తెచ్చి నిర్మించుకున్నారు. కానీ 4నెలల నుంచీ ప్రభుత్వ సబ్సిడీ సొమ్ములు విడుదల కాలేదు. వడ్డీలు పెరిగిపోతున్నాయి. రూ.150 కోట్ల బకాయిలు వున్నాయి. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు 150 కోట్ల రూపాయలు విడుదల చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

# పొగాకు కొనుగోలు చేయాలి

**పొగాకు కంపెనీలను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య**






**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** మే 15 నుండి 30 వ తేదీ లోపు పొగాకు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పొగాకు కంపెనీ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పొగాకు కొనుగోలుపై కంపెనీల ప్రతినిధులు, జిల్లా వ్యవసాయాధి కారి, ఎ.డి మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ పొగాకు కొనుగోలు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అలా కాకుండా మంచి ధర ను ఇవ్వాలని సూచించారు..పూర్తిగా పొగాకు పంటను May 15 నుండి 30వ తారీఖు లోపు కొనుగోలు చేయాలని జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. SCAP (సిరి పొగాకు) కు సంబంధించి కొనుగోలు కేంద్రాన్ని ఓర్వకల్లు లో ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాలని GPI Company ని ఆదేశించారు. బీడి పొగాకు , నాటురకం పొగాకు ను కూడా పూర్తిగా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ITC, GPI, VST, Alliance, Deccan Tobaco, SST, PTP Ltd, కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఈ విషయం పై పొగాకు కంపెనీ ప్రతినిధులతో మరొక సమావేశం నిర్వహించి జిల్లాలో పండించిన పొగాకును పూర్తిగా, మంచి ధరలతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఏడి మార్కెటింగ్ నారాయణమూర్తి, సహాయ వ్యవసాయ సంచాలకులు సాలు రెడ్డి, కర్నూలు డివిజన్ మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## బధిరులైన ప్రతిభావంతులకు స్మార్ట్ ఫోన్ పంపిణీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి




**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** చిత్తూరు జిల్లాలోని బధిరులైన విభిన్న ప్రతిభావంతులకు (మూగ,చెవిటి) వారికీ జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి స్మార్ట్ ఫోన్ లను అందజేశారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో మేనేజింగ్ డైరెక్టర్, ఏపిడిఏ ఎస్‌సిఏసి విజయవాడ వారు పంపిణి రూ.4,50,000/- తో 30 టచ్ ఫోన్లను (ఒక టచ్ ఫోన్ రూ.15,000లు) జాయింట్ కలెక్టర్ వారి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్,విభిన్న ప్రతిభా వంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఏ వై శ్రీనివాసులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## కస్తూరి విశ్వనాథ నాయుడుతో భేటీ అయిన పుల్లంపేట మండల ముఖ్య నాయకులు





**రైల్వే కోడూరు పెన్ పవర్ ఏప్రిల్ 28 :** అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం రైల్వే కోడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఈరోజు అనగా 27.04.2025 వ తేదీన ఆదివారం నాడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ కస్తూరి విశ్వనాథ నాయుడు తో ప్రత్యేకంగా భేటీ అయి పుల్లంపేట మండలంలోని ఎదుర్కొంటున్న పలు సమస్యలను అదేవిధంగా గత ఐదేళ్లు రాక్షస పాలనలో కష్టపడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. శ్రీ కస్తూరి విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కొరకు కష్టపడిన ప్రతి కార్యకర్త నాకు గుర్తున్నారు. జగన్ రెడ్డి రాక్షస పాలనలో మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ కొరకు ఎండనక వాననక తెలుగుదేశం పార్టీ ఆదేశించినటువంటి ప్రతి కార్యక్రమం తూచా తప్పకుండా విజయవంతం చేయడం జరిగినది. అయితే మీలాంటి నిజాయితీ గల కార్యకర్తలు ఇప్పుడు న్యాయం జరగడం లేదని చెబుతుంటే చాలా బాధాకరమని అన్నారు. అయితే తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త ఎవరు అధైర్య పడొద్దు నేనున్నానంటూ భరోసా ఇవ్వడం జరిగిందన్నారు.

# వైసీపి పాలకుల పాపాలకు బలైన మరో అధికారి?

**పలమనేరు ఏప్రిల్ 28 (పెన్ పవర్) :** నియోజకవర్గ పరిధి వి.కోట మండల కేంద్రం లోని పంచాయతీ ఈ.ఓ.గా గతంలో విధులు నిర్వహించిన యాదవపతి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశాడని జిల్లా అధికారులు ఆయనపై సస్పెండ్ వేటు వేశారు. వాస్తవానికి పంచాయతీ నిధుల్లో ఒక్క రూపాయి కూడా తన సొంతానికి వాడుకోలేదని,పైగా ఆయన గత ప్రభుత్వములో అప్పటి నాయకుల ఆదేశాలను తూచా తప్పక పాటించడమే ఆయన చేసిన తప్పుగా భావించవచ్చు.అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుని రాజకీయ చదరంగంలో బలైన అధికారే పంచాయతీ ఈ.ఓ.యాదవపతి. అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకుల దెబ్బకు ఒక పంచాయతీ ఈ.ఓ.నే కాదు ఐఏయస్ లు, ఐపియస్.లే బలైపోయారు.ఇందులో అధికారులు మాత్రమే కాదు,క్రింది స్థాయి సిబ్బంది కూడా సర్వ నాశనం అయిపోయారనే దానికి వి.కోటలో ఒక చిన్న స్థాయి ఉద్యోగి ఉదాహరణ. వి.కోట ఈ.ఓ. యాదవపతి బాధ్యతలు స్వీకరించిన్నప్పటి నుండీ జరిగిన పూర్తి వివరాలిలా.. వై.సి.పి. పాలన వచ్చిన వెంటనే కరోనా మహమ్మారి వచ్చిన సంగతి అందరికి విధితమే. అప్పుడు పంచాయితీ ఎన్నికలు నిర్వహించ లేదు. ఈనేపథ్యంలో యం.పి.డీ.ఓ.అన్ని పంచాయతీల అధికారిగా (స్పెషల్ ఆఫీసర్ గా) ఉంటూ ఆ పంచాయతీలో ఉన్న పంచాయతీ సెక్రటరీ లకు సర్వాధికారాలు ఇస్తూ ప్రభుత్వం జీ.ఓ.జారీ చేసింది. అప్పటి ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధికి వి.కోట పంచాయతీపై కన్ను పడింది.ఇదే అదునుగా బావించి తన ప్రథమ శిష్యుణ్ణి రంగంలోకి దించి ఈ.ఓ.యాదవపతి దగ్గరకు పంపి తనకు ఏమి కావాలన్న దానిపై దృష్టిసారించాడు. తాను వస్తె బావుండదు అనే దృక్పథంతో తన అన్న కొడుకు అనిచెప్పుకు తిరిగే వ్యక్తిని రంగం లోకి దించాడు.ఆ ప్రజాప్రతినిధి ఇలా వి.కోట ఈ.ఓ.ను ఏవిధంగా మోసగించారో అర్థమౌతుంది. గత వైసీపి ప్రభుత్వం వచ్చిన వెంటనే మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి 2021సంవత్సరం మార్చి 8వ తేదీన వేలంపాట నిర్వహించారు. ఈవేలం పాటలో ఇతరులు పాల్గొనకుండా ఎమ్మెల్యే అనుచరులే పాల్గొన్నారు.ఒక్క రూపాయి కూడా డిపాజిట్ కట్టలేదు వారపు సంతకు 1లక్ష 60 వేలు డిపాజిట్ కట్టాలి,కానీ కట్టలేదు. దినసరి కూరగాయల సంతకు 3లక్షల 50వేలు కట్టాలి కానీ కట్టలేదు.ప్రైవేటు బస్టాండుకు 2లక్షల 80 వేలు కట్టాలి,కానీ కట్టలేదు,పశువుల సంత 80వేలు, గొర్రెలు,మేకల సంతకు 80వేలు,జంతు వదశాలకు2 వేలు,పాత సామాన్లు 6వందలు, ఇలా మొత్తం 9లక్షల 52 వేల 6వందలు కట్టాలి. కానీ నేను ప్రజా ప్రతినిధి ఎవరిదగ్గర డబ్బులు కట్టించకోకు నేను మళ్ళీ కడతానని హుకుం జారీచేశారు. అంతే కానీ వచ్చిన ప్రజాప్రతినిధి అనుచరులు వేలంలో వారపు కూరగాయల సంత 3లక్షల 52వేల రూపాయలను దేవరాజ్ అనే వ్యక్తి పాడుకొన్నాడు.దినసరి కూరగాయాల మార్కెట్ ను వేలంలో యం.శేఖర్ అనే వ్యక్తి 5లక్షల 91 వేలకు పాడుకున్నాడు. ఇక ప్రవేటు బస్ స్టాండ్ 14 లక్షల ఒక వేయి రూపాయలకి రెడీమేడ్ మురళి పాడుకొన్నాడు.అదే విధంగా గొర్రెలు, మరియు మేకల సంతను పి.మణి అనే వ్యక్తి 4లక్షల 51 వేలకు,అలాగే బాత్ రూమ్స్ ను కే.యం.నారాయణ 1లక్ష,11వేల 4వందలకు,సంతలో ఉన్న బాత్ రూమ్స్ ను కే.ఉదయకుమార్ అనే వ్యక్తి 30వేల 200 వందలకు,జంతు వద శాల ఉదయ్ కుమార్ 8 వేల150రూపాయలకు,ఎరువుల దిబ్బకు విజయ్ కుమార్ 2 వేల 100, పాత సామాన్లు 3 వేల 300 రూ.లకు వేలం పాటలో పాల్గొని వేలం దగ్గించుకొని డిపాజిట్లు మరియు సంవత్సరంలోపల వేలంలో పాల్గొని వసూలు చేసిన డబ్బులు కట్టకుంటే ఎలా అని ఆ నాయకున్ని ప్రశిస్తే! నేను ఎమ్మెల్యే అన్న కొడుకు అని వాదించాడు. అంతే కాకుండా ఎటువంటి అక్షరపరిజ్ఞానం లేని ఈ.ఓ.వద్ద తను నిర్మిస్తున్న కాలేజ్ నిర్మాణం కోసం స్టీల్ సిమెంట్ కోసం 7లక్షల 50వేలు,అలాగే చేతి నుండీ మరో 5లక్షలు, ఎమ్మెల్యే వేసిన లేఔట్ లో సైడ్ కోసం 15 లక్షలు, ఎమ్మెల్యే ఖర్చుల కోసం మరో 5 లక్షలు, పంచాయతీలో టెండర్ లో కట్టవలసిన టెండర్ ఫీజు (ఇది ఒక్కరూపాయి కూడా కట్టలేదు) 12లక్షల 50 వేలు,వేలంలో పాల్గొని ప్రవేటు బస్ స్టాండ్ తీసుకున్న మురళి పంచాయతీకి కట్టవలసిన డబ్బులు 12 లక్షల 1 వేయి, అలాగే డైలీ మార్కెట్ ఎత్తిన శేఖర్ 4లక్షల 41 వేలు ఇలా మొత్తం 61లక్ష 42వేల 400 రూ..లు ఇందులో సైడ్ కు ఇచ్చిన 15 లక్షలు ఇచ్చాడు తప్ప మిగిలిన లక్షలు ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోగా బెదిరింపు దోరణితో నేను మంత్రి పెద్దిరెడ్డి మనిషి అనే నానుడి.అలాగే నేడు తాను సస్పెండ్ కావడానికి కర్త కర్మ అప్పటి ఎమ్మెల్యేతో పాటు,అనుచరుడు. ఇన్ని లక్షలు తిన్నా మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం లేదు. ఎమ్మెల్యే అనుచరుడికి 5 మరియు 10 రూ.లు వడ్డీకి తీసి కట్టిన వ్యక్తి ఈ. ఓ.యాదవపతి. ఇలా కట్టికట్టి నేడు ముద్దాయిగా ప్రజల ముందు నిలబడ్డాడు. కానీ అప్పటి యం.పి.డీ.ఓ 5లక్షలు కూతురి పెళ్లి కోసం తీసుకున్నాడు. అందులో ఏదో తూతూమంత్రంగా ఇచ్చాడు.ఎందుకంటే అప్పటి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ తనే అతను కూడా ఈఓ యాదవపతిని ఏమార్చాడు.అంటే ఇందులో ముద్దాయిలు ఎవరు మాజీ ఎమ్మెల్యే అతని అనుచరుడు, అలాగే అప్పటి, మరియు ప్రస్తుత పంజాని యం.పి.డీ.ఓ.లే ప్రధాన కారణం.అసలు ఒక్క రూపాయి కూడా ముట్టుకోని అధికారిపై ఇలా నిందలు పడడం చాలా బాధాకరమని పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సంపూర్ణ విచారణ జరిపి, నిజాయితీ గల అధికారులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై ఆడిట్ చేయాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** పిజిఆర్‌ఎస్ అర్జీలను నాణ్యంగా పరిష్కారం అయ్యాయా లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్‌ఎస్) లో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్‌ఎస్ లాగిన్ లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందని, ఇందుకు సంబంధించి పోలీస్ శాఖ లో 1400, డిఆర్ఓ వద్ద 1100, ఏడి సర్వేయర్ వద్ద 540, డ్వామా పిడి వద్ద 50, హౌసింగ్ పిడి వద్ద 67, వ్యవసాయ శాఖ వద్ద 79, డిఎంహెచ్ఓ వద్ద 97 పెండింగ్ ఉన్నాయని, అలాగే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ల వద్ద కూడా ఎక్కువ సంఖ్యలో అర్జీల ఆడిట్ పెండింగ్ ఉందని, త్వరితగతిన వీటిని ఆడిట్ చేసి పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.. సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 25, కర్నూలు ఆర్డీఓ వద్ద 24, పత్తికొండ ఆర్డీఓ వద్ద 11, డిఆర్డిఏ పిడి వద్ద 6, సర్వే ఏడి వద్ద 4, అటవీశాఖ, సివిల్ సప్లైస్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఒక్కొక్క అర్జీ చొప్పున పెండింగ్ లో ఉన్నాయన్నారు.. సిఎంఓ గ్రీవెన్స్ లు పెండింగ్ ఉండకూడదని, ఎప్పటికపుడు పరిష్కారం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సునయన ఆడిటోరియంలో కలెక్టర్ వేదిక పై నుండి కిందకు దిగి వచ్చి విభిన్న ప్రతిభావంతుల నుండి, సునయన ఆడిటోరియం బయట అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు.. వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు..

# "రాజంపేట, బద్వేలు సబ్ జైలుల విజిట్





**కడప పెన్ పవర్ ఏప్రిల్ 28 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు రాజంపేట మరియు బద్వేల్ సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ల ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాజంపేట మండల న్యాయ సేవా సమితిని, బద్వేలు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో కడప ట్రైనీ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.ఆశా ప్రియ, రాజంపేట మరియు బద్వేల్ సబ్ జైలుల సూపర్డెంట్ లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# ఉగ్రదాడిపై "మానవత" ఆగ్రహం

**- పర్యాటకుల మృతికి ఘన నివాళి**

**- మతోన్మాద పాక్ ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదు**



**తిరుపతి/పెన్ పవర్/ఏప్రిల్ 28 :** కాశ్మీర్ లోని పహల్గాంలో మతోన్మాద పాక్ ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా దాడి చేసి కాల్చి చంపిన పాక్ ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదని తిరుపతి మానవత శాఖ తీవ్రంగా హెచ్చరించి, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం ఉదయం తిరుపతిలోని రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో మానవతా సభ్యులు ముష్కరుల దాడిలో మృతి చెందిన హిందూ బంధువులకు మౌనం పాటించి, ఘన నివాళి అర్పించారు. కాశ్మీర్ ఘటనను మతోన్మాద దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఓంకారంతో పుష్పాంజలి ఘటించి భారత్ మాతాకీ జై, వందేమాతరం, జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పాక్ ఉగ్రవాద ముష్కరులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందూ దేశంలో పాక ఉగ్రవాదులను ఏరి పారేయాలి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భగవంతుని ప్రార్థించారు. అనంతరం మానవతా నెలవారి సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మానవతా సెంట్రల్ కమిటీ డైరెక్టర్ ఎన్వి కృష్ణారెడ్డి, చైర్మన్ భార్గవ, కో చైర్మన్ రాళ్లపల్లి మాధవ నాయుడు, అధ్యక్షులు ఎన్వి రమణ, కార్యదర్శి సుకుమార్ రాజు, కోశాధికారి భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు వేణుగోపాల్, పద్మనాభం, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, సిరిగిరి శంకర్ రాజు, గురు ప్రసాద్, రిటైర్డ్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, సాయి కృష్ణమరాజు, సుందర కుమార్ రాజు, కోనేటి రవి రాజు,బాలాజీ నాయుడు, మాధవ రాజు, నరసింహులు, మార్కండేయ రెడ్డి, రామస్వామి, సాయి రెడ్డి, నిరంజన్ నాయుడు, లోక్ సింగ్, షణ్ముగం, రమణయ్య, సుధాకర్ బాబు, నీరజ,భార్గవి, నవీన్, ప్రవీణ్, లోకేష్, సుధాకర్ అధిక సంఖ్యలో మానవతామూర్తులు పాల్గొన్నారు.

# బూరగమంద శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు





**చిత్తూరు పెన్ పవర్ ఏప్రిల్ 28 :** చిత్తూరు జిల్లా సదుం మండలం బూరగమంద గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు మే 8 నుండి 16వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. మే 7న సాయంత్రం అంకురార్పణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 8 గంటలకు వాహనసేవలు జరుగనున్నాయి. మే 17వ తేదీన సాయంత్రం 5 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

**బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :**

08-05-2025 - సాయంత్రం - ధ్వజారోహణం
09-05-2025 - సాయంత్రం - శేష వాహనం
10-05-2025 - సాయంత్రం - హంస వాహనం
11-05-2025 - సాయంత్రం - హనుమంత వాహనం
12-05-2025 - సాయంత్రం - కల్యాణోత్సవం, గరుడ వాహనం
13-05-2025 - సాయంత్రం - పుష్ప పల్లకి
14-05-2025 - సాయంత్రం - సింహ వాహనం
15-05-2025 - సాయంత్రం - అశ్వవాహనం
16-05-2025 - ఉదయం - చక్రస్నానం, సాయంత్రం - గజ వాహనం, ధ్వజావరోహణం. ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత కార్యక్రమం, హరికథాగానం, కోలాటాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరణ



**చిత్తూరు జిల్లా, పలమనేరు :** సోమవారం పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు మందిరంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమర నాథ్ రెడ్డి,జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్,పలమనేరు ఆర్డీఓ భవానీ,జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు,పి ఆర్ ఎస్ ఈ చంద్ర శేఖర్ రెడ్డి, డ్వామా పిడి రవికుమార్, డిపిఓ సుధాకర్ రావు, డిఆర్డిఏ, ఐసిడిఎస్ పిడి లు శ్రీదేవి, వెంకటేశ్వరి,ఏపీ ఎస్ పి డి సి ఎల్ ఎస్ఈ ఇస్మాయిల్,ఏడి సర్వే జయ రాజ్,ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్, డి ఎల్ డి ఓ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్,కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ ల పర్య వేక్షకులు,రెవెన్యూ డివిజన్ పరిధి లోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఇతర డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ : నిర్మల



**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 28 :** సునయన ఆడిటోరియం నందు కిశోర బాలికల సాధికారతలో భాగంగా వేసవి సెలవుల యందు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించబడిన ప్రత్యేక క్యాలెండర్ లో భాగంగా జిల్లా శాఖల నుండి హాజరైన అధికారులకు అందరికీ వివరణ ఇవ్వడం జరిగింది ఇందులో భాగంగా కిషోర్ బాలికల సాధికారతలో భాగంగా గ్రామాల్లో వారి కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడానికి ప్రణాళిక రూపొందించడం జరిగిందని అదేవిధంగా బాల్య వివాహాల నివారించడానికి అన్ని శాఖలతో కలిసి సమ సమన్వయంతో పనిచేయడానికి కృషి చేస్తున్నామని అదేవిధంగా కిషోర్ బాలికల సాధికారతకు వారి జీవితాలను మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన అడుగు నిలుస్తుందని తెలిపారు నేటి సమాజంలో తల్లిదండ్రులకు బాలికల భద్రత రోజురోజుకీ సవాలు మారుతుందని కిషోర్ బాలికల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులు గా చేయవలసిన అవసరం ఉందని తెలిపారు నేడు చాలా వరకు అన్ని పోటీ పరీక్షల్లో బాలికలుగా పై చేయిగా ఉన్నప్పటికీ ఎంతో మంది కిషోర్ బాలికలు తమ కలలను నెరవేర్చుకోలేక ముందే బాల్య వివాహాలకు బలైపోతున్నారని మరి కొంతమంది బాల కార్మికుల మారుతున్నారని చెప్పారు మరోవైపు బాలికలు ఇంట బయట తెలిసిన వ్యక్తుల ద్వారా లైంగిక వేధింపులకు గురై చెప్పుకోలేక తమలో తామే కుంటిపోతున్నారని మరి కొంత మంది తెలియని తనంతో ప్రేమ పేరిట ప్రభావముంతకు ప్రలోభాలకు గురై నమ్మి మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కిషోర్ బాలికల సాధికారతను సాధికారత కిషోర్ బాలికల సాధికారత కోసము ఈ వేసవి సెలవు యందు రూపొందించిన ఈ క్యాలెండర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ఈ కిషోర్ వికాసం ఇలాంటి మహోత్తర కార్యక్రమాన్ని అన్ని శాఖల అన్ని శాఖలు బాధ్యతగా తీసుకొని మన రేపటి భావితరాలైన కిషోర్ బాలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని తెలిపారు ముఖ్యంగా కిషోర్ బాలికలకు తమను తామే రక్షించుకునే విధంగా తయారు చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. కిషోర్ బాలికల సాధికారతలో భాగంగా ఈ సమ్మర్ సమ్మర్ స్పెషల్ ప్రోగ్రాం ఈ నెల రెండవ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించడానికి ప్రణాళికను రూపొందించామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

## ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన పరిష్కరించాలి



**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన స్పందించి.. నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు డిప్యూటీ కలెక్టర్ల లతో కలిసి.. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కార నివేదికలు పంపాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు.. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని.. ఒంటిమిట్ట మండలం నరవకాటిపల్లె గ్రామం నుండి షేక్ గఫార్ రహిమాన్... ఇంటి స్థలానికి ప్రొసెసింగ్ సర్టిఫికెట్ కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారికి అభ్యర్థించారు. కమలాపురం మండలం అప్పాయపల్లె నుండి ఎం. మునీర్ అహ్మద్.. సర్వే నెం. 847/ఏ లోని 4.79 ఎకరాల భూమి... రెవెన్యూ ఆన్ లైన్ రికార్డుల్లో. ఇండోమెంట్ భూమిగా చూపిస్తోందని, రికార్డులను సవరించి న్యాయం చేయాలని డిఆర్వోకు నిన్నవించారు. కడప నగరం ప్రకాష్ నగర్‌కు చెందిన టి. నారాయణ రెడ్డి.. తనకు చెందిన ఇంటి స్థలాన్ని ఇతరులు ఆక్రమించి, అక్రమంగా గేటును కూడా ఏర్పాటు చేశారని అధికారులు కల్పించుకుని న్యాయం చేయాలని.. డిఆర్వోకు అభ్యర్థించారు. సికే దిన్నె మండలం మామిళ్లపల్లెకు చెందిన కృష్ణా రెడ్డి.. తనకు ఎలాంటి భూమి సంబందిత ఆస్తులు లేవని, కానీ ఆన్లైన్.లొంతనపెరు మీద భూమి ఉన్నట్లు చూపుతోందని, తద్వారా తన కిమారుడికి ప్రభుత్వ ఉపకార వేతనం.అందకుండా పోయిందని.. ఆన్ లైన్ లో తనపేరుతో ఉన్న రికార్డు వివరాలను తొలగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, వెంకటపతి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడి కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు డివిజన్ స్థాయి విఆర్ఏల నూతన కమిటీ ఎన్నిక



**పలమనేరు ఏప్రిల్ 28, (పెన్ పవర్) :** పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వి.ఆర్.ఏ.ల సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవో భవానీ కు వినతిపత్రం అందజేశారు. సోమవారం వి.ఆర్.ఏ.ల డివిజన్ సమావేశం ఏర్పాటు చేసి డివిజన్ పరిధిలో గల మండలాలలో వివిధ సమస్య గురించి చర్చించి తదుపరి పలమనేరు డివిజన్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్డీవో భవానీ ని కలిసి తమ సమస్యల గురించి వివరించి వినతిపత్రం అందించారు. అలాగే నూతన కమిటీని కూడా ఎన్నుకున్నారు. అందులో డివిజన్ అధ్యక్షులుగా మోహన్, పలమనేరు మండలం ఉపాధ్యక్షులు మునికుమార్,వి.కోట మండల ప్రధాన కార్యదర్శి వాసు, బైరెడ్డి పల్లి ట్రెజరర్ శ్రీలత, సోమల డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్ భాష,బంగారు పాళ్యం జాయింట్ సెక్రటరీ శివకుమార్, పెద్దపంజానిలను ఎన్నుకోన్నారు. డివిజన్ కమిటీని డివిజన్ పరిధిలోని అన్ని మండలాల విఆర్ఏల ఆమోదంతోనే ఏర్పాటు చేయడం జరిగిందని సభ్యులు తెలిపారు. ఇందులో వి.ఆర్.ఎలు కోదండన్, లక్ష్మణ్, దేవరాజ్, ఇర్ఫాన్ అలీ, వినాయక,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పి4 సర్వే 43 021 బంగారు కుటుంబాలు ఆదుకునేందుకు మార్గదర్శకాలను అన్వేషించాలి : కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్, 28 : పి4 సర్వే ద్వారా గుర్తించిన 43,021 బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శులను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించేందుకు గాను పి4 (ప్రజా-ప్రైవేట్-ప్రజల భాగస్వామ్యం) సర్వే చేసి రాష్ట్రంలో ఉన్న సంపన్నులను మార్గదర్శులుగా, అత్యంత పేదవారిని బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి అవసరమైన చేయూతను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 43,021 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. అదే విధంగా జిల్లా పరిధిలో ఉన్నత స్థాయి వ్యక్తులను గుర్తించి మార్గదర్శులుగా నమోదు చేయాలని మండల తహశీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు కూడా మార్గదర్శి కుటుంబాలను స్ఫూర్తిగా తీసుకొని బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వాలని కోరారు. ఇందులో భాగంగానే రెడ్ క్రాస్ సంస్థ వారు చెంచు కుటుంబాలను ప్రోత్సాహం ఇచ్చేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు.

**బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ప్రారంభం :** జిల్లా కేంద్రంలో కెనాల్ కాంపౌండ్ లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో త్వరలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీలో వెయ్యి రూపాయలు చెల్లిస్తే జీవితకాలం సభ్యత్వం ఉంటుందని, 12 వేలు చెల్లించి వైస్ ప్యాట్రాన్ గా, 25 వేలు చెల్లించి ప్యాట్రాన్ గా ఉండే అవకాశం ఉందని, ప్యాట్రాన్, వైస్ ప్యాట్రాన్ కు ప్రెసిడెంట్ చేతుల మీదుగా సర్టిఫికేట్, మిగతా వారికి గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు వెయ్యి రూపాయలు, ఆధార్ కార్డు, 2 ఫోటోలు ఇచ్చి శాశ్వత సభ్యత్వం పొందాలన్నారు. సభ్యత్వం పొందిన వారికి అవసరమైనప్పుడు లేదనకుండా బ్లడ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అప్కాస్ కు సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకోవడానికి అధికారులు నేరుగా ఫైల్ ను జిల్లా ఇంచార్జి మంత్రి పంపుతున్నారని అలా కాకుండా జిల్లా కలెక్టర్ నుండి ఫైల్ పంపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజల నుండి వివిధ రకాల వినతులు ఇవ్వడం జరుగుతుందని వాటిని కూడా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ప్రజా పరిష్కార వేదికకు 285 అర్జీలు : కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయమునకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణంలో వారు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, త్రాగునీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు వచ్చిన అర్జీదారులకు అందించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో పాటు డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధా రాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులు అందించారు.

**శాఖల వారీగా అర్జీల వివరాలు :** రెవెన్యూ-145, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్- 7, సివిల్ సప్లై - 7, పోలీస్ శాఖ- 12, ఆర్ డబ్ల్యు ఎస్-5, ఎస్ ఎస్ ఎల్ ఆర్ - 10, పంచాయతీ రాజ్-28, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్-2, విద్యా శాఖ-15, ఏపీఎస్పీ డిసిఎల్ - 2, రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ -3, రూరల్ డెవలప్మెంట్ - 3, హౌసింగ్ -5, రూరల్ పావర్టీ -14, ఎంప్లాయ్& ట్రైనింగ్-2, సాంఘిక సంక్షేమ శాఖ-2, ఐసిడిఎస్-2, ఎస్ సి ఫైనాన్స్ కార్పోరేషన్-3, జి ఎస్ డబ్ల్యు ఎస్-1, పబ్లిక్ హెల్త్ -9,



నేషనల్ హైవే-2, మత్స్య శాఖ-1, ఆర్ అండ్ బి-1, టూరిజం & డెవలప్మెంట్-2, ఎక్సైజ్ శాఖ-1, బి.సి. వెల్ఫేర్-1 వెరసి మొత్తం 285 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరూ వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి



**సత్యవేడు/పెన్ పవర్/ ఏప్రిల్ 28 :** ఆర్టీసీఉద్యోగులకు గత నాలుగు సంవత్సరాలుగా ఆగిన పదోన్నతులను వెంటనే కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షులు పెరుమాళ్ డిమాండ్ చేశారు. వివిధ సమస్యల సాధన కోసం ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం సత్యవేడు డిపో ప్రాంగణంలో పలువురు ఎంఎంయు ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా రీజనల్ అధ్యక్షులు ఎస్ జె.పెరుమాళ్ మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం 1/2019 సర్కులర్ అమలు చేయాలన్నారు.మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు.ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు.గ్యారేజ్ ఉద్యోగుల అపరస్కృత సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యోగుల పోరాటం కొనసాగుతుందన్నారు. అంతకుమునుపు ఎన్ఎంయు రీజనల్ అధ్యక్షులు ఎస్ జె పెరుమాళ్ ఆధ్వర్యంలో డిపో అధ్యక్షులు పార్ధసారధిరెడ్డి,వాసుదేవయ్య, గోపాల్, పోలయ్య, విజయన్, గజేంద్రన్, బాలాజీ తదితరులకు ఉద్యోగులు పూలమాలలు వేయడంతో రిలే నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఉదయం 9 గంటల నుంచి రిలే నిరాహార దీక్ష కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్యారేజీ అధ్యక్షులు కుప్పయ్య, సుధాకర్, కుమార్, గోపన్న, ఆనందయ్య, ప్రకాష్,వర్మ,కరీముల్లా,వాసులు,వినోద్ కుమార్, వేణు,పాపయ్య సంఘీభావంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 45 వినతులు : కమిషనర్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య



**తిరుపతి/ పెన్ పవర్/ ఏప్రిల్ 28 :** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 45 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 9 మంది తమ సమస్యలు తెలుపగా, 35 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, ఆరని సంధ్య, అనిల్ కుమార్ విచ్చేసి తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ చేపల మార్కెట్ ఎదురుగా కాలువలు సరి చేయాలని, అన్నారావు కూడలి వద్ద రోహిణి అపార్ట్మెంట్ వద్ద నీటి సమస్య పరిష్కరించాలని, తిరుచానూర్ వెళ్ళే మార్గంలో గరుడ వారధి పనులు సక్రమంగా పూర్తి చేయాలని, మధురానగర్ వద్ద యూ.డి.ఎస్. పనులు పూర్తి చేయాలని, జయస్యాం థియేటర్ సమీపంలో కూలెందుకు సిద్ధంగా ఉన్న భవనాన్ని పరిశీలించాలని, సూరయ్య కట్ట వద్ద ఆక్రమించి నిర్మించిన స్థలం చూడాలని, కొర్లగుంట వద్ద సి.సి.రోడ్డు నిర్మించాలని, గిరిపురం లో గుంతల రోడ్డు సరి చేయాలని అలాగే పలువురు సమస్యలు పరిష్కరించాలని కోరారని తెలిపారు.

## వివిధ ప్రాజెక్టులకు భూబదలాయింపు...

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 28 :** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూబదలాయింపు త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో విండ్ పవర్ ప్రాజెక్టులు, ఏపీ జెన్కో, రిలయన్స్ బయోగ్యాస్, ఎంఎస్ఎంఈ పార్కులు, డంపింగ్ యార్డ్, తదితర ప్రాజెక్టులకు సంబంధించి సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ సమక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విండ్ పవర్ ప్రాజెక్టు, ఏపీ జెన్కో, రిలయన్స్ బయోగ్యాస్, ఎంఎస్ఎంఈ పార్కులు, డంపింగ్ యార్డ్, కమ్యూనిటీ భవనాలు, 4జి మొబైల్, డిఎల్డిఓ కార్యాలయం, తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూబదలాయింపు మరియు భూమి అప్పగింతకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలను వెంటనే పంపాలని ఆదేశించారు. విండ్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి కళ్యాణదుర్గం, శెట్టూరు, కంబదూరు తహసిల్దార్లు జాయింట్ తనిఖీ చేసి ల్యాండ్ ఫిజిబులిటీ రిపోర్ట్ వెంటనే అందజేయాలన్నారు. ఆయా ప్రాజెక్టులకు ప్రాధాన్యతగా భూపదలాయింపు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఎన్.హెచ్-544డి, 150ఏ, 426, తదితర రహదారులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా రహదాలకు సంబంధించి భూసేకరణ పెండింగ్ లేకుండా వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎన్.హెచ్ పిడి తరుణ్ కుమార్, టెక్నికల్ మేనేజర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేసిన ఎంపీపీ



**కార్వేటినగరం/పెన్ పవర్ /ఏప్రిల్ 28 :** కార్వేటి నగరం మండల కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఎంపీపీ లతా బాలాజీ సోమ వారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఎన్ని మంది రోగులు వస్తున్నారు. వారికి ఎటువంటి వైద్య సేవలు అందిస్తున్నారు విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి ప్రయత్నం చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి భాగ్యలక్ష్మి ఎంపీపీ తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి మండల కోఆప్షన్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, ఈవో నాగరత్నమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యపై బాధితుల దగ్గర ఫిర్యాదులు స్వీకరించిన తాసిల్దార్ మధుసూదన్ రావు



**తొట్టంబేడు/పెన్ పవర్/ఏప్రిల్ 28 :** శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టం బేడు మండలం గుండెలగుంట పంచాయతీ ఇరపాక్షి పురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత ప్రభుత్వంలో నా భూమిని దర్జాగా ఆన్లైన్లో ఎక్కించు కున్నాడని బాధితుడు పుల్లారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు గ్రీవెన్స్ డే కార్యక్రమం భాగంగా సోమవారం తాసిల్దార్ మధుసూదన్ రావుకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మార్వోకి సమస్యను వివరిస్తూ.. విరూపాక్షపురం రెవిన్యూ లెక్కల ప్రకారం 80/12ఏ 14 సెంట్లు, 80/12బి 15 సెంట్లు, అదేవిధంగా (78/17ఏ 10 సెంట్లు,78/17 బి 10 సెంట్లు) గత ప్రభుత్వంలో రాసగల్లా రాజా అనే వ్యక్తి ఆన్లైన్లో ఎక్కిం చుకున్నారని, మా భూమిని మీరు ఎలా ఎక్కించుకుంటారని మేము అడగ డంతో మరలా నా పేరు పైనే ఆన్లైన్లో ఎక్కించారని, ఇప్పటికీ ఆ 20 సెంట్లు అతని పేరు మీదనే ఉందని ఆ భూమిని క్యాన్సిల్ చేయాలని బాధితుడు పుల్లారెడ్డి పాటు కుటుంబ సభ్యులు సోమవారం తాసిల్దార్ మధుసూదన్ రావుకు ఫిర్యాదును అందజేశారు. తాసిల్దార్ స్పందించి మీరు ఇచ్చిన ఫిర్యాదును సున్నంగా పరిశీలించి మీకు న్యాయం చేస్తామని తెలిపారు.

## శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు



**శ్రీకాళహస్తి/పెన్ పవర్/ఏప్రిల్ 28 :** జిల్లా ఏసీబీ అడిషనల్ ఎస్పీ అధికారి విమల కుమారి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కార్యాలయంలో ఏసీబి అధికారులు దాడులు సోమవారం నిర్వహించారు. అనంతరం సెలవులో ఉన్న శ్రీకాళహస్తి ఎమ్మార్వో ని కూడా ఆఫీసుకు పిలిపించి విచారిస్తున్నారు. మండల సర్వేయర్ పురుషోత్తంపై ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో బాధితుల నుంచి 25000 వేలు లంచం తీసుకుంటున్న మండల సర్వేయర్ పురుషోత్తంని నిర్ధారించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏసీబీ అడిషనల్ ఎస్పీ విమల కుమారి, ఏసీబీ డిఎస్పి జెస్సీ ప్రశాంతి, వారి సిబ్బంది, తనిఖీలు పాల్గొన్నారు.

# ఏపీ బీజేపీకి కొత్త ఛీఫ్

**విజయవాడ, ఏప్రిల్ 28, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో నాయకత్వ సమస్య ఇబ్బందికరంగా మారినట్లు కనిపిస్తుంది. కేవలం టీడీపీ, జనసేనతో కలసి పోటీ చేయడం వల్లనే ఆ మాత్రం నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచింది. లేకుంటే ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలం ఒక్క శాతం ఓట్లు మాత్రమే. అంటే దీనికి ప్రధాన కారణం నాయకత్వ లేమి అని కేంద్ర నాయకత్వం కూడా నిర్ధారణకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటి నుంచే కాదు.. తొలి నుంచి ఈ సమస్య ఉంది. టీడీపీతో జట్టుకడితేనే నాలుగు స్థానాలు సాధించి ఇటు శాసనసభలోనూ, అటు పార్లమెంటులోనూ కమలం పార్టీ అడుగు పెడుతుంది. పేరున్న నేతలున్నప్పటికీ వారు రాష్ట్ర స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగలవారు ఎవరూ లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని చెప్పకతప్పదు.ఎవరి ప్రభావం... గత ఎన్నికల్లో పురంద్రీశ్వరి పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ ఆమె ప్రభావం పనిచేసింది తక్కువేనని చెప్పాలి. 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసినప్పుడు పురంద్రీశ్వరి ఎన్టీఆర్ కుమార్తె అయినప్పటికీ విశాఖలో ఓటమి పాలయ్యారు. సో.. పురంద్రీశ్వరి అయినా... అంతకు ముందు సోము వీర్రాజు అయినా.. ఆ ముందు కన్నా లక్ష్మీనారాయణ అయినా పార్టీ ఓటు బ్యాంకును పెంచే ప్రయత్నం చేయలేదు. అంటే వారికి అంతా సత్తా లేదు. మోదీ చరిష్మా కూడా ఏపీలో పెద్దగా పనిచేయకపోవడంతో ఇతర పార్టీల పైన ఆధారపడి గెలవాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. సామాజికవర్గాల వారీగా, ఆస్తుల పరంగా చూసినా అంతే. ఏ మాత్రం పనిచేయదన్నది గత కొన్ని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. అయితే ఇప్పుడు పురంద్రీశ్వరిని మార్చాలని కేంద్ర నాయకత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ పదవిని ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే ఎవరికి ఇచ్చినా ఒరిగేదేమీ లేదన్న సంగతి తెలిసినా పార్టీని కొంతైనా ఊపు కలిగించేలా తీసుకెళ్లే నేత కోసం కేంద్ర నాయకత్వం అన్వేషిస్తుందని తెలిసింది. పురంద్రీశ్వరికి



పదోన్నతి ఇచ్చి ఇక్కడ బీజేపీ అధ్యక్షుడిగా సుజనా చౌదరిని నియమిస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. సుజనా చౌదరి అయితే ఆర్థికంగా బలవంతుడు కావడంతో ఆయనకు పదవి ఇస్తే పార్టీ కార్యక్రమాలను విరివిగా నిర్వహించే అవకాశముందని ఆయనను ఎంపిక చేస్తారన్నది కూడా గత కొంతకాలంగా వినపడుతుంది. . కానీ పురంద్రీశ్వరి, సుజనా చౌదరి ఒకే సామాజికవర్గం కావడంతో ఈసారి బీసీలకు పదవి ఇవ్వాలని డిమాండ్ వినపడుతుంది. జనసేనలో కాపు సామాజికవర్గానికి చెందిన పవన్ కల్యాణ్ అధినేతగా ఉండగా, టీడీపీకి చంద్రబాబు ఉన్నారు. ఈ రెండు సామాజికవర్గాలు కాకుండా బీసీలకు అప్పగిస్తే ఆ ఓటు బ్యాంకును తెచ్చుకునేందుకు అవకాశముంటుందని భావిస్తున్నారు. మరొకవైపు రెడ్డి సామాజికవర్గం నుంచి కూడా కొన్ని పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెబుతున్నారు. అయితే ఎప్పటికప్పుడు కేంద్ర నాయకత్వం ఆలోచనలు మారుతుండటంతో చివరకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారన్నది తేల్చరు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో పార్టీ పదవి ఎవరికిస్తే ఆ సామాజికవర్గం కాకుండా వేరే సామాజికవర్గానికి పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వనున్నారన్న టాక్ బలంగా వినపడుతుంది.

# అమరావతికి మహర్దశ



**అమరావతి, ఏప్రిల్ 28, పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటన ఖరారయింది. మే 2వ తేదీన ప్రధాని అమరావతి పర్యటనకు వస్తున్నారు. రాజధాని పునర్మిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం కూడా అధికారికంగా ప్రకటిచింది. ప్రధాని సాయంత్రం నాలుగు గంటలకు అమరావతికి చేరుకుని దాదాపు రెండు గంటల పాటు అక్కడే ఉంటారు. అయితే ప్రధాని మోదీ ఈసారి కీలక ప్రకటనలు చేయనున్నారని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ కు గత ఐదేళ్లుగా రాజధాని లేకుండా పోయింది. అమరావతిలో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. 2014లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత అమరావతిని రాజధానిగా ఎంపిక చేసిన తర్వాత వచ్చి నాలుగు మాటలు, మూట మట్టి ఇచ్చి, నీళ్లు ఇచ్చిపోయారన్న విమర్శలు అప్పట్లో బలంగానే వినిపించాయి. పరిస్థితులు వేరుగా ఉండటంతో... అయితే 2014 నాటి పరిస్థితులు... 2024 నాటి పరిస్థితులు రాజకీయంగా వేరుగా ఉన్నాయి. నాడు మోదీకి చంద్రబాబు అవసరం లేదు. నేడు మాత్రం మోదీకి చంద్రబాబు మద్దతు ఖచ్చితంగా ఉండాలి. అందుకే నాడు అమరావతి నిర్మాణానికి పెద్దగా నిధులు కానీ, ప్రకటనలు కానీ చేయకుండా వెళ్లిపోయారని అంటున్నారు. అయితే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పదిహేను వేల కోట్ల రూపాయల రుణాన్ని అప్పుగా ఇవ్వడానికి కేంద్ర అనుమతి ఇచ్చింది. వరల్డ్ బ్యాంకు, ఆసియన్ డెవలప్ మెంట్ బ్యాంకు నుంచి కలిపి పదిహేను వేల రూపాయలు, హడ్కో నుంచి మరో పదకొండు వేల కోట్ల రూపాయల రుణాలను తీసుకుని అమరావతి తొలి దశ పనులను వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నారు.నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు ఖరారయ్యాయి. మోదీ శంకుస్థాపన తర్వాత పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, మూడేళ్లలో పనులు పూర్తి చేసి అమరావతికి రూపు రేఖలు తీసుకు రావాలన్నలక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. ఈ సమయంలో రాష్ట్రానికి వస్తున్న నరేంద్ర మోదీ ఖచ్చితంగా మంచి సానుకూల ప్రకటన చేస్తారని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ సంస్థల ఏర్పాటుకు ఇప్పటికే అమరావతిలో భూములు కేటాయించారు. వాటి ఏర్పాటు కూడా సత్వరం పూర్తయ్యేలా ప్రధాని ప్రకటన ఉండే అవకాశముంటుందని చెబుతున్నారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సాయాన్ని కూడా అందించే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేకపోతున్నారు... ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్ ఖరారయింది. మే2న సాయంత్రం నాలుగు గంటలకు అమరావతి పునర్మిర్మాణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. పదిహేను నిమిషాల పాటు రోడ్ షో ఉంటుంది. తర్వాత బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఇందుకోసం సచివాలయం వెనక భారీ వేదికను సిద్ధం చేశారు. మూడు గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు హెలికాప్ట్ లో అమరావతికి చేరుకుంటారు. అనంతరం 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహిస్తారు. తర్వాత అమరావతి పెవిలియన్ ను సందర్శించి సాయంత్రం ఐదు గంటల వరకూ సభలో ప్రసంగించి తిరిగి ఢిల్లీకి బయలుదేరిసుమారు 5 లక్షల మంది ప్రజలు ప్రధాని సభకు వస్తారని

అంచనా వేస్తున్నారు. దానికి తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు మంత్రి నారాయణ. %జు 11,జు13,జు% 15 రోడ్లతో పాటు సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి రాకపోకలు జరుగుతాయి. ఇప్పటికే పోలీస్ శాఖ రోడ్లు పరిశీలించి గుంతలు పూడ్చాలని సూచించింది.. ప్రధాని సభకు వచ్చే వాహనాల కోసం మొత్తం 11 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటుచేస్తున్నారు.మొత్తం 8 రోడ్ల ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చుమంగళగిరి నుంచి రెండు రోడ్లు. తాడేపల్లి నుంచి ఒకటి,వెస్ట్ బైపాస్ నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజి నుంచి రెండు, తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రాపురం నుంచి ఒక రోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ జామ్ కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీస్ శాఖ తెలిపింది. పోలీస్ శాఖ సూచనల మేరకు రెండు రోజుల్లోగా రోడ్లన్ని సరిచేయాలని సీఆర్డీఏ అధికారులకు ఆదేశించినట్లు మంత్రి నారాయణ చెప్పారు. ఈ స్వల్ప మార్పులు మినహా ప్రధాని మోదీ అమరావతి పర్యటన లో ఎలాంటి చేంజెస్ ఉండవని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# కష్టాల్లో బుట్టా...

**కర్నూలు, ఏప్రిల్ 28, పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎంపీ బుట్టా రేణుకకు చెందిన ఖరీదైన ఆస్తులను ఎల్ఐసీ హౌమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వేలం వేస్తోంది. రూ. 310 కోట్ల రూపాయలు రుణం తీసుకుని చెల్లించడం మానేశారు. నెల వాయిదాలు కూడా చెల్లించడం లేదు. దీంతో గతంలోనే ఆమె ఆస్తులను వేలం వేసే ప్రక్రియను ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ ప్రారంభించింది. బంజారాహిల్స్ లో ఉన్న ఐదు వేల గజాల స్థలం, మాదాపూర్ లో ఉన్న బుట్టా కన్వెన్షన్ సెంటర్ ను వేలానికి పెట్టింది. గతంలో వేలానికి పెట్టినా తర్వాత ఇబ్బందులు వస్తాయని ఎవరూ రాకపోవడంతో వాయిదా పడింది. ఇప్పుడు ఆమె ప్రజాప్రతినిధి కాకపోవడంతో పాటు వైసీపీ కూడా ఏపీలో అధికారంలో లేదు. అందుకే తమకు రావాల్సిన రూ.340 కోట్ల రూపాయలను బంజారాహిల్స్ లోని ఐదు చదరపు గజాలను, మాదాపూర్ లోని బుట్టా కన్వెన్షన్ సెంటర్ ను అమ్మకానికి పెట్టి రికవరీ చేసుకోవాలని ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ నిర్ణయం తీసుకుంది. బుట్టా రేణుక కుటుంబానికి స్కూళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్లు, కార్ డీలర్ షిప్‌లు ఇలా చాలా వ్యాపారాలు ఉన్నాయి. బుట్టా రేణుక వెట్కాఎస్ఆర్‌సీపీ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. 2014లో ఆమె వైసీపీ తరపు నుంచి కర్నూలు లోక్ సభకు ఎంపికయ్యారు. అయితే ప్రభుత్వంలోకి టీడీపీ రావడంతో ఆమె చంద్రబాబును కలిశారు. బుట్టా రేణుక భర్త టీడీపీ కండువా కప్పుకున్నారు. బుట్టా రేణుక మాత్రం అనర్హతా వేటు పడుతుందన్న కారణంగా టీడీపీలో చేరలేదు. కొన్ని రోజులకు మళ్లీ టీడీపీకి దూరయ్యారు. ఎన్నికలకు ముందు అధికారికంగా మళ్లీ వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లభించలేదు. ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలోనే కొనసాగారు. కానీ ఎలాంటి పదవులు లభించలేదు. 2024 ఎన్నికల్లో కర్నూలు ఎంపీ టిక్కెట్ ను ఆశించారు. అయితే సీఎం జగన్ మాత్రం ఆమెకు ఎమ్మిగనూరు టిక్కెట్ కేటాయించారు. ఎమ్మిగనూరు సిట్టింగ్ ఎమ్మెల్యేకు టిక్కెట్ నిరాకరించి బుట్టా రేణుకకు సీటు కేటాయించారు. అయితే కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్ఆర్‌సీపీ తుడిచి పెట్టుకుపోయింది.

ఎమ్మిగనూరులోనూ ఓడిపోయింది. ఎన్నికల ప్రచార సభల్లో జగన్ అభ్యర్థులను పరిచయం చేసేటప్పుడు బుట్టా రేణుకను సౌమ్యురాలు.. డబ్బులు కూడా అంతంతమాత్రమే అని పరిచయం చేశారు. అయితే తనకు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని బుట్టా రేణుక యూట్యూబ్ ఇంటర్వ్యూల్లో చెప్పిన వీడియోలు అప్పట్లో వైరల్ అయ్యాయి. బుట్టా రేణుకను ట్రోల్ చేశారు. ఆమె ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలోనే ఆస్తుల వేలం ప్రకటన వచ్చింది. తమ ఆస్తుల వేలంపై బుట్టా రేణుక కుటుంబం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. డిఫాల్ట్ అయినందున.. వారు ఆస్తుల్ని అమ్ముకుని రికవరీ చేసుకోవచ్చని వదిలేసినట్లుగా చెబుతున్నారు. బుట్టా రేణుక విజయవంతమైన వ్యాపారవేత్త అని.. రాజకీయాల్లోకి వచ్చి ఆమె నష్టపోయారని ఆమె అనుచరులు అంటున్నారు.

# గంటా వర్సెస్ విష్ణుకుమార్ రాజు

**విశాఖపట్టణం, ఏప్రిల్ 28, పెన్ పవర్:** విశాఖ సిటీలో కూటమి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, గంటా శ్రీనివాసరావు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇటీవల ఫిలింనగర్ క్లబ్ లీజ్ విషయంలో విష్ణుకుమార్ రాజు కలెక్టర్ కు లేఖ రాశారు. అయితే ఆ వ్యవహారం ది భీమిలి నియోజకవర్గం పరిధిలోకి వస్తుందని.. తనకు తెలియకుండా లీజు వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికి ఎలా తీసుకెళ్లారని అంటూ విష్ణు కుమార్ పై మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. ఈ లీజు వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికీ తీసుకెళ్లే సమయంలో మీరు అందుబాటులో లేరని.. గంటా శ్రీనివాస్ కు క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు విష్ణు కుమార్. ఓ కార్యక్రమంలో గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఆ సమయంలో గంటా కారులో కూర్చొని సీరియస్ గా మాట్లాడుతుంటే.. విష్ణు కుమార్ రాజు కారు పక్కనే నిలబడి సమాధానం చెబుతూ ఉన్నారు. ఈ తతంగాన్ని మీడియా వీడియోలు తీసింది. గంటా శ్రీనివాసరావు మాత్రం వినకుండా కేకలు వేస్తూ వాహనంలో కూర్చొని మరింత ఆగ్రహంతో స్పందించారు. ఈ క్రమంలో తోటి నేతలు సర్ది చెప్పే ప్రయత్నం చేయగా.. గంటా అదేం పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. 2014లో విశాఖ ఫిల్మ్ క్లబ్ ను ఏర్పాటు చేశారు. సినిమా , సాంస్కృతిక కార్యకలాపాల ప్రభుత్వం నుండి భూమిని లీజుకు తీసుకుంది. ఈ భూమి విలువైన బీచ్ రోడ్డు ప్రాంతంలో ఉండటం వల్ల, దీనిపై రాజకీయ నాయకులు , వివిధ గ్రూపుల దృష్టి పడింది. వైఎస్ఆర్‌సీపీ హయాంలో క్లబ్ పాలకవర్గం మారిపోయింది. విజయసాయిరెడ్డి కనుసన్నల్లో ఈ వ్యవహారాలు నడిచాయని చెబుతారు. 2024 జూన్‌లో, క్లబ్‌లోని "వైఎస్ఆర్ లాన్స్" అనే పేరును క్లబ్ సభ్యులు తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వం క్లబ్‌పై ఒత్తిడి చేసి, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి పేరుతో బోర్డు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ చర్యను క్లబ్ సభ్యులు వ్యతిరేకించారు, వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత, ఈ పేరును తొలగించారు.ఈ క్లబ్ లీజు వ్యవహారంలో ఏం జరిగిందో కానీ గంటా శ్రీనివాసరావు మాత్రం.. విష్ణుకుమార్ రాజు జోక్యాన్ని సహించలేదు. ఆయన తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆ క్లబ్ భీమిలి నియోజవర్గంలోకి రావడమే కాదు ఆ క్లబ్ ఏర్పాటులో గంటా శ్రీనివాసరావు కూడా కీలక పాత్ర పోషించారు. విష్ణుకుమార్ రాజు క్షమాపణలు చెప్పినందున .. ఈ వ్యవహారంలో ఇంతటితో సద్దుమణిగిపోయి ఉంటుందని భావిస్తున్నారు.

# ఏపీలో 9 రకాల స్కూల్స్

**విజయవాడ, ఏప్రిల్ 28, పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యారంగ సంస్కరణలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన 117 జీవో రద్దు చేసి మొత్తం 9 రకాల బడుల విధానం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ప్రాథమిక జాబితాను రూపొందించారు.కూటమి ప్రభుత్వం విద్యారంగ



సంస్కరణలపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ-117ను రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా 9 రకాల పాఠశాలలు తీసుకురాబోతుంది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రాథమిక జాబితాను రూపొందించారు. ఇప్పటి వరకు ఉన్న 6 రకాల బడులు స్థానంలో మరో మూడు జోడించి 9 రకాల బడుల విధానం అమలు చేయనున్నారుఉన్నత పాఠశాలలో 4 రకాలు, ప్రాథమిక పాఠశాలల్లో 45 మంది లోపు ఉంటే బేసిక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా పిలుస్తారు. 45 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే తరగతికొక టీచర్‌ను కేటాయిస్తారు. వీటిని ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా పిలుస్తారు. 1-10 తరగతులుంటే బేసిక్, ఆదర్శ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 900 వరకు ఏర్పాటు చేయనున్నారు.కొన్ని ప్రాథమికోన్నత స్కూల్స్, ఇంటర్మీడియట్‌తో కలిపి హైస్కూల్ ప్లస్‌లుగా కొనసాగిస్తారు. క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా 240కి పైగా ప్రాథమికోన్నత బడులను కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయించింది.ముందుగా 5 రకాల బడులను తీసుకురావాలని భావించినప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితుల నేపథ్యంలో మొత్తం 9 రకాలు పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి నూతన బడుల విధానం అమల్లోక రానుంది.

9 రకాల బడులు

అంగన్‌వాడీలను మార్పు చేసి ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్- 1, 2 (ఎల్‌కేజీ, యూకేజీ) బడులను శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్ గా ఏర్పాటు చేస్తారు. వీటిని మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించనుంది.

ప్రీ ప్రైమరీ-1, 2తో పాటు ఒకటి, రెండో తరగతులు కలిపి ఫౌండేషన్ పాఠశాలలుగా పిలుస్తారు.

పీపీ-1, 2తోపాటు 1-5 తరగతులు ఉండే పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూల్స్ గా ఏర్పాటు చేస్తారు.

1-5 తరగతుల్లో 45 మందిలోపు పిల్లలుంటే వాటిని బేసిక్ ప్రైమరీ స్కూల్స్ గా పరిగణిస్తారు.

పీపీ-1, 2, ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉండి, 45 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా పరిగణిస్తారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగనున్నాయి. 6, 7, 8 తరగతుల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొన్నింటిని ఉన్నత పాఠశాలలుగా, మరికొన్నింటిని ప్రాథమిక పాఠశాలలుగా పరిగణిస్తారు.

6 నుంచి 10 తరగతులు వరకు ఉన్నత పాఠశాలలు ఉంటాయి.

1-10 తరగతులు ఉంటే బేసిక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా పరిగణిస్తారు. జీఓ-117 రద్దుతో 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొచ్చి వీటికి 1, 2 తరగతులను జోడించారు.

1-10 తరగతులు ఉంటే ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేసి, ప్రాథమిక బడుల్లో 45 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే తరగతికి ఒక్క ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు.

రాష్ట్రంలో మొత్తం 294 హైస్కూల్ ప్లస్‌లు కొనసాగిస్తారు. వీటిల్లో 1-12 లేదా 6-12 తరగతులు ఉంటాయి.

# రాయలసీమలో మారుతున్న రాజకీయ పరిస్థితులు

**తిరుపతి, ఏప్రిల్ 28, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ మళ్లీ పుంజుకుంటున్నట్లు కనిపిస్తుంది. గత ఎన్నికల్లో కోల్పోయిన స్థానాలను తిరిగి నిలబెట్టుకునే దిశగా ఫ్యాన్ పార్టీ అడుగులు వేస్తుంది. అయితే అన్ని ప్రాంతాల్లో కాదు. ప్రస్తుతం రాయలసీమలో మాత్రం వైసీపీ బలం క్రమంగా పెరుగుతున్నట్లు అనేక విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏడాదిలోనే రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో సీన్ ఛేంజ్ అయినట్లు కనిపిస్తుంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుపర్చకపోవడంతో పాటు ఆధిపత్య పోరు రాయలసీమలో నేతల మధ్య ఎక్కువగా కనిపిస్తుంది. అదే కూటమి పార్టీ విజయానికి ఇబ్బందికరంగా మారుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో... రాయలసీమలో నాలుగు జిల్లాలున్నాయి. చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 52 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నాలుగు జిల్లాల్లో కేవలం ఏడు చోట్ల మాత్రమే గత ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. జగన్ మోహన్ రెడ్డి సొంత జిల్లా అయిన కడపలోనూ కేవలం మూడు స్థానాల్లోనే గెలిచింది. అనంతపురం జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే ఒక్క స్థానంలోనూ గెలవలేదు. కర్నూలు జిల్లాలో పన్నెండు స్థానాల్లో ఉంటే వైసీపీ రెండు స్థానాల్లోనే విజయం సాధించింది. చిత్తూరు జిల్లాలో పథ్నాలుగు స్థానాలుంటే కేవలం వైసీపీ రెండు స్థానాలకే పరిమితమయింది. మిగిలిన పన్నెండు స్థానాలను కూటమి గెలుచుకుంది. కూటమి పార్టీలు గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ కలసి పోటీ చేయడంతో పాటు అందరూ కలసి సమన్వయంతో పనిచేయడం కూడా గత ఎన్నికల్లో గెలుపునకు కారణంగా చెబుతున్నారు. అయితే మంత్రి పదవుల దగ్గర నుంచి నామినేటెడ్ పోస్టుల వరకూ కూటమి నేతల్లో అసంతృప్తి పెరిగిందంటున్నారు. అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నప్పటికీ నేతల మధ్య కీచులాటలు ప్రతి నియోజకవర్గంలో కనిపిస్తున్నాయి. మూడు పార్టీల నేతలకు నియోజకవర్గాల్లో పొసగడం లేదు. తమ వల్లనే గెలుపు సాధ్యమయిందని నమ్మిన నేతలు ఎన్నికల ఫలితాల తర్వాత తమ వారికి అన్యాయం చేసి వేరే వారికి, ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. అమరావతికి ఇక మంచి రోజులేనట నలభై నియోజకవర్గాల్లో... దీంతో రాయలసీమలోని దాదాపు నలభై నియోజకవర్గాల్లో కూటమి నేతలకు మధ్య యుద్ధం నేరుగానే జరుగుతుంది. ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి కనిపించడం లేదు. తాము సీట్లను త్యాగం చేసి కూటమి పార్టీలకు కట్టబెట్టినా వారు కేర్ చేయడం లేదన్న భావన అన్ని పార్టీల్లో నెలకొంది. దీంతో నియోజకవర్గాల్లో కూటమికి కష్టాలు మొదలయ్యాయంటున్నారు. ఇక ఎమ్మెల్యేలపై కూడా ఏడాది కాలంలోనే వ్యతిరేకత పెరగడం కూడా రాయలసీమలోనే ఎక్కువగా జరుగుతుందంటున్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి కలసి రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసినా ఇక్కడ మాత్రం నేతలు ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి లేదని అధికార పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. మరోవైపు జగన్ పట్ల సానుభూతి కూడా క్రమంగా పెరుగుతుండటంతో రాయలసీమలో వైసీపీకి కొంత అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని

# ఎవరి స్థానంలో ఆడించాలో మీరే చెప్పండి.. రూ.10 కోట్ల బౌలర్‌పై పీటర్సన్ హాట్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫాస్ట్ బౌలర్ నటరాజన్ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ లో కూడా ఆడలేదు. ఢిల్లీ ఈ సీజన్ లో 9 మ్యాచ్ లాడినా ఈ తమిళ నాడు పేసర్ కు ఒక్క మ్యాచ్ లో కూడా ప్లేయింగ్ 11 లో అవకాశం ఇవ్వలేదు. 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ లో నటరాజన్ ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.10.75 కోట్లకు దక్కించుకుంది. గత సీజన్ లో సన్ రైజర్స్ తరపున ఆడిన నట్టూ.. ఏ ఈ సారి క్యాపిటల్స్ కు వెళ్లడంతో ఆ ఆజట్టు బౌలింగ్ దుర్భేధ్యంగా మారింది అనుకున్నారు. కానీ కట్ చేస్తే అసలు నటరాజన్ ను ఎందుకు కొన్నారో అర్థం కావడం లేదు. తొలి మ్యాచ్ లో పూర్తి ఫిట్ నెస్ సాధించలేదనే కారణంగా తుది జట్టులో స్థానం కల్పించలేదు. ఆ తర్వాత అయినా ఆడతాడనుకుంటే నిరాశే మిగిలింది. అయితే ఆదివారం (ఏప్రిల్ 27) రాయల్ ఛాలెంజర్స్ తో మ్యాచ్ ముగిసిన తర్వాత నటరాజన్ పై ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్ కెవిన్ పీటర్సన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు నటరాజన్ ప్లేయింగ్ 11 లో పనికి రాడంటూ అన్నట్టుగా మాట్లాడాడు. పీటర్సన్ మాట్లాడుతూ.. "నటరాజన్ జట్టు కోసం ఎప్పుడైనా ఆడడానికి సిద్ధమే. కానీ దురదృష్టవ శాత్తు అతను 12 మంది ఆటగాళ్లలో చోటు దక్కించుకోలేకపోతున్నాడు. నటరాజన్ ను ఎవరి స్థానంలో ఆడించాలో మీరే చెప్పండి". అని పీటర్సన్ అన్నాడు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ మిచెల్ స్టార్క్, చమీర లాంటి ఫారెన్ ఫాస్ట్ బౌలర్లతో పాటు.. టీమిండియా పేసర్ ముకేశ్ చౌదరీ జట్టులో ఉన్నారు. ఢిల్లీ తమ ప్రారంభ మ్యాచ్ ల్లో మోహిత్ శర్మకు ఎక్కువగా అవకాశాలు ఇచ్చింది. అతను పెద్దగా రాణించలేకపోయాడు. దీంతో మోహిత్ స్థానంలో నటరాజన్ కు ఛాన్స్ ఇవ్వకుండా చమీరను తుది జట్టులో తీసుకొచ్చారు. తొలి నాలుగు మ్యాచ్ లు వరుసగా గెలిచిన ఢిల్లీ.. ఆ తర్వాత ఆడిన 5 మ్యాచ్ ల్లో రెండే గెలిచింది. నటరాజన్ లాంటి ఫాస్ట్ బౌలర్ ఢిల్లీ జట్టులో ఉంటే జట్టు బలంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చమీరాను పక్కన పెట్టి నటరాజన్ కు ఛాన్స్ ఇవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# మరోసారి అదే తప్పు రిపీట్.. పంత్ చేసిన పొరపాటుకు జట్టు మొత్తానికి పనిష్‌మెంట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో లక్నో సూపర్ జయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ ఈ సీజన్ లో రెండో సారి స్లో ఓవర్ రేట్ కు గురయ్యాడు. ఆదివారం (ఏప్రిల్ 27) ముంబై ఇండియన్స్ పై జరిగిన మ్యాచ్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా పంత్ కు రూ.24 లక్షల రూపాయల ఫైన్ వేశారు. దీంతో ఐపీఎల్ 2025 సీజన్ లో రెండో సారి స్లో ఓవర్ రేట్ ఎదుర్కొన్న కెప్టెన్ గా నిలిచాడు. టాస్ గెలిచి లక్నో ఫీల్డింగ్ తీసుకుంది. దీంతో ముంబై మొదట బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. ముంబై ఇన్నింగ్స్ దాదాపు రెండు గంటల పాటు జరిగింది. ఫీల్డింగ్ లో మార్పులు చేయడానికి పంత్ ఎక్కువగా సమయం తీసుకున్నాడు. రెండో సారి స్లో ఓవర్ రేట్ కావడంతో ఈ సారి కెప్టెన్ తో పాటు లక్నో జట్టులోని మిగిలిన ఆటగాళ్లకు కూడా ఫైన్ వేశారు. ఇంపాక్ట్ ప్లేయర్ తో సహా జట్టులోని మిగిలిన ఆటగాళ్లకు టోర్నమెంట్ ప్రవర్తనా నియమావళి ప్రకారం.. ఒక్కొక్కరికి రూ. 6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25% ఏది తక్కువైతే అది జరిమానా విధించబడుతుంది. ఈ సీజన్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా శిక్ష అనుభవించిన కెప్టెన్ల లిస్ట్ లో పంత్ తో పాటు శుభ్‌మాన్ గిల్ (గుజరాత్), అక్షర్ పటేల్ (ఢిల్లీ క్యాపిటల్స్), సంజు సామ్సన్ (రాజస్థాన్ రాయల్స్), రజత్ పాటిదార్ ( రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), రియాన్ పరాగ్ (రాజస్థాన్ రాయల్స్ ), హార్దిక్ పాండ్యా (ముంబై ఇండియన్స్) ఉన్నారు. ఈ సీజన్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్లకు జరిమానా విధించబడదు. అయితే కెప్టెన్లకు డీమెరిట్ పాయింట్లు ఇస్తారు. ఇవి మూడు సంవత్సరాల పాటు కొనసాగుతాయి. ఈ నిషేధం తీవ్రమైన సందర్భాల్లో మాత్రమే జరుగుతుంది. ఈ మ్యాచ్ లో పంత్ కెప్టెన్సీలోనూ బ్యాటింగ్ లోనూ తీవ్రంగా నిరాశపరిచాడు. మొదట కెప్టెన్ గా విఫలమైన పంత్.. ఆ తర్వాత బ్యాటింగ్ లో కేవలం 4 పరుగులే చేసి ఔటయ్యాడు. పంత్ నిర్లక్ష్యపు షాట్ కారణంగా లక్నో ఓటమి దిశగా పయనించింది. మ్యాచ్ తర్వాత ఈ లక్నో కెప్టెన్ పై విమర్శలు వస్తున్నాయి. ఆదివారం (ఏప్రిల్ 27) వాంఖడే వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో లక్నో సూపర్ జయింట్స్ పై ముంబై ఇండియన్స్ 54 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ లో రికెల్ టన్ (32 బంతుల్లో 58: 6 ఫోర్లు, 4 సిక్సర్లు), సూర్య కుమార్ యాదవ్ (28 బంతుల్లో 54:4 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర ఆటతో పాటు బౌలింగ్ లో బుమ్రా విజృంభించి ముంబై విజయంలో కీలక పాత్ర పోషించారు. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో161 పరుగులకు ఆలౌటైంది. ప్రస్తుతం లక్నో సూపర్ జయింట్స్ ఈ సీజన్ లో 10 మ్యాచ్ ల్లో 5 విజయాలు సాధించి ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. వరుసగా రెండు మ్యాచ్ ల్లో ఓడిపోవడం ఆ జట్టును తీవ్ర కలవరానికి గురి చేస్తుంది. మిగిలిన నాలుగు మ్యాచ్ ల్లో గెలిస్తే ప్లే ఆఫ్స్ కు వెళ్తుంది. మూడు మ్యాచ్ లు గెలిస్తే రేస్ లో ఉంటుంది. లక్నో తమ తదుపరి మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్ (మే 4), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (మే 9), గుజరాత్ టైటాన్స్ (మే 14) జట్లతో తలపడనుంది.

# టార్గెట్ అదిరింది: ప్లే ఆఫ్స్, టైటిల్ కాదు.. మా ప్రధాన లక్ష్యం అదే




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తిరుగులేకుండా పోతుంది. రజత్ పటిదార్ కెప్టెన్సీలోని ఆర్సీబీ జట్టు ఈ సీజన్ లో కాన్ఫిడెంట్ గా కనిపిస్తుంది. ఆదివారం (ఏప్రిల్ 27) ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో విజయం సాధించడం ద్వారా ఈ సీజన్ లో హ్యాట్రిక్ విజయాలను అందుకుంది. తొలి 7 మ్యాచ్ ల్లో నాలుగు మ్యాచ్ లు గెలిచిన ఆర్సీబీ.. ఆ తర్వాత వరుసగా మూడు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ప్రస్తుతం 10 మ్యాచ్ ల్లో 7 విజయాలు సాధించిన బెంగళూరు జట్టు ప్లే ఆఫ్స్ కు చేరువలో ఉంది. ఈ దశలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్ తమ లక్ష్యంపై కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆదివారం (ఏప్రిల్ 27) ఢిల్లీ క్యాపిటల్స్ తో మ్యాచ్ ముగిసిన తర్వాత తమ తదుపరి లక్ష్యం గురించి మాట్లాడాడు. జట్టు ప్రస్తుతం ప్లే ఆఫ్స్ క్వాలిఫికేషన్ గురించి ఆలోచించడం లేదని.. తమ ప్రధాన లక్ష్యమంతా టాప్ 2 పైనే ఉందని చెప్పాడు. పటిదార్ మాటలను బట్టి చూస్తుంటే ఆర్సీబీ జట్టు ఎంత కాన్ఫిడెంట్ గా ఉందో అర్థమవుతుంది. ఈ సీజన్ లో ఆర్సీబీ మరో నాలుగు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగా తమ తదుపరి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్ తో శనివారం (మే 3) తలబడుతుంది. వీటిలో 3 గెలిచినా టాప్ 2 లో ఎంట్రీ ఇస్తుంది. టాప్ 2 లో ఉన్న జట్లకు ఫైనల్ కు వెళ్లాలంటే రెండు అవకాశాలు ఉంటాయని తెలిసిందే. టాప్-2 లో అర్హత సాధించిన జట్లు మొదట క్వాలిఫయర్ 1 ఆడుతుంది. ఈ మ్యాచ్ గెలిస్తే నేరుగా ఫైనల్ కు వెళు ్తంది. ఒకవేళ ఓడిపోయినా ఇంకో ఛాన్స్ ఉంటుంది. ఎలిమినేటర్ లో ఓడిపోయిన జట్టుతో క్వాలిఫయర్ 2 లో తలపడుతుంది. ఈ మ్యాచ్ లో గెలిస్తే ఫైనల్ కు చేరుతుంది. ప్రస్తుతం టాప్ 2 లో ఉండడం అంత తేలిక కాదు. బెంగళూరుతో పాటు ముంబై, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ టాప్-2 లో చేరే అవకాశం ఉంది. ఆర్సీబీ తమ తదుపరి మ్యాచ్ లు చెన్నై సూపర్ కింగ్స్, సన్ రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జయింట్స్, కోల్ కతా నైట్ రైడర్స్ తో ఆడాల్సి ఉంది.

# రెమ్యూనరేషన్ తో స్పెషల్ సాంగ్స్ మరింత స్పెషల్



చీరలో కృతి శెట్టి యొక్క అందమైన క్లిక్‌లు



ఇండియన్ సినిమాలో డ్యాన్స్ నెంబర్లు ఎప్పటినుంచో భాగమైన విషయం తెలిసిందే. అయితే ఈ సాంగ్స్ ను ఎప్పుడైతే హీరోయిన్లు చేయడం మొదలుపెట్టారో అప్పట్నుంచి వాటికి డిమాండ్ బాగా పెరిగిపోయింది. హీరోయిన్లు ట్రాక్ లోకి రావడంతో ఈ సాంగ్స్ ను స్పెషల్ సాంగ్స్ అని పిలుస్తున్నారు. ప్రస్తుతం ఈ స్పెషల్ సాంగ్స్ సినిమాల విజయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక సినిమాను మించి మరో సినిమాలో స్పెషల్ సాంగ్ కోసం ఖర్చు పెడుతూ మేకర్స్ ఆ సాంగ్ ను మరింత స్పెషల్ చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ఆ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్లను తీసుకుని వారితో ఆ స్పెషల్ సాంగ్ ను చేయించి వారికి భారీ రెమ్యూనరేషన్ ను ముట్టజెప్పుతున్నారు. డ్యాన్స్ తో సంబంధం లేకుండా వారి మార్కెట్, క్రేజ్ ను క్యాష్ చేసుకోవాలనే ఆలోచనతో నిర్మాతలు సదరు హీరోయిన్లకు ఎంత అడిగితే అంత ఇస్తూ వస్తున్నారు. నోరా ఫతేహి లాంటి బాలీవుడ్ డ్యాన్సర్లు ఒక్కో సాంగ్ చేయడానికి రూ.2 కోట్లు ఛార్జ్ చేస్తుండగా, సన్నీ లియోన్ కూడా అంతే తీసుకుంటున్నట్టు సమాచారం. కెవ్వు కేక సాంగ్ లో కాలు కదిపిన మలైకా అరోరా ఖాన్ రూ. 50 లక్షల నుంచి రూ.1 వరకు తీసుకుందన్నారు. బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ స్పెషల్ సాంగ్ లో కనిపించాలంటే రూ. 1.5 కోట్లు ఇవ్వాల్సిందే.

కత్రీనా కైఫ్ ఒక్కో సాంగ్ కు రూ. 2 కోట్లు తీసకుంటే, స్పెషల్ సాంగ్స్ కు కేరాఫ్ అయిన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ మాత్రం రూ.3 కోట్లు తీసుకుంటుంది. ఊర్వశీ రౌతెలా కూడా రూ. 3 కోట్లు ఛార్జ్ చేస్తుందని, దబిడి దిబిడి సాంగ్ తర్వాత తన డిమాండ్ ఇంకా పెరిగిందని అంటున్నారు. అయితే ఇప్పుడు ఈ స్పెషల్ సాంగ్స్ చేస్తున్న వారిలో సమంత, తమన్నాటాప్ లో ఉన్నారు.

పుష్ప సినిమాలో స్పెషల్ సాంగ్ అయిన ఊ అంటావా సాంగ్ కు సమంత ఏకంగా హీరోయిన్ రష్మిక కంటే ఎక్కువగా రెమ్యూనరేషన్ తీసుకుంది. రష్మిక పుష్ప కోసం రూ. 2 కోట్లు తీసుకుంటే సమంత మాత్రం ఆ ఒక్క సాంగ్ కోసం రూ.5 కోట్లు తీసుకుందట. ఇక తమన్నా రీసెంట్ టైమ్స్ లో ఐటెం సాంగ్స్ కు బ్రాండ్ అంబాసిడర్ గా మారింది. స్వింగ్ జర సాంగ్ తో మొదలుపెట్టిన తమన్నా తర్వాత అప్పుడప్పుడు స్పెషల్ సాంగ్స్ లో మెరుస్తూ వచ్చింది. జైలర్ సినిమాలో కావాలయ్యా సాంగ్ తో తన క్రేజ్ ను విపరీతంగా పెంచుకున్న తమన్నా ఆ తర్వాత స్త్రీ2లో కనిపించి అందరినీ మరోసారి అలరించింది. తాజాగా రైడ్2 లో కూడా తమన్నా ఓ స్పెషల్ సాంగ్ చేసింది. ఆ సాంగ్ కోసం మిల్కీ బ్యూటీ ఏకంగా రూ.5 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకుని వార్తల్లోకెక్కింది.



శ్రీలీల అద్భుతమైన పోజులు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com